ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
గురువారం 25 జూలై 2024



● నగరంలోని ప్రభుత్వ వైద్య విద్య కళాశాల హాస్టల్లోకి గత నెల 19వ తేదీ ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి మెడికోల సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు దోచుకెళ్లారు. విషయాన్ని వెంటనే గమనించిన వైద్య విద్యార్థులు దర్గా మిట్ట పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. తమ మొబైళ్లను ట్రాక్ చేస్తే వెంటనే దొంగలను పట్టుకోవచ్చని పోలీసులకు మొరపెట్టుకున్నారు. కానీ వారిలో చలనం కరువైంది. చివరకు ఉన్నతాధికారులతో సిఫారసు చేయించడంతో కేసు నమోదు చేశారు. ఆ తరువాత విచారణ కూడా సరిగ్గా చేయలేదని విద్యార్థులు వాపోయారు. సీసీ పుటేజీలలో నిందితుల ఫొటోలను అందించినా పోలీసులు తేలిగ్గా తీసుకున్నారు. చివరకు పోలీసులు మీరు పోగొట్టుకున్న వస్తువుల చివరి లొకేషన్ చెన్నై పోర్టులో చూపించిందని, మళ్లీ ఫోన్లు ఆన్ చేస్తే తప్ప చేసేదేమీ లేదంటూ చేతులెత్తేశారు.

● బుచ్చిరెడ్డిపాళెంలో చిరువ్యాపారం చేసుకుంటున్న ఓ మహిళ తన కుమార్తెను గుర్తు తెలియని వ్యక్తులు లాక్కెళ్లారంటూ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయినా పోలీసులు పట్టించుకోకపోవడంతో జనసేన నాయకుల సహకారంతో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి తమ గోడు వినిపించింది. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సూచనల మేరకు సీఐ కేసు నమోదు చేయించారు.

● నెల్లూరు కార్పొరేషన్‌లో కమిషనర్ సంతకం ఫోర్జరీ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చ నడుస్తోంది. అయితే ఈ కేసు విషయంలో దర్గామిట్ట పోలీసులను ఏ విషయం అడిగినా తమకు సంబంధం లేదంటూ సమాచారం ఇస్తున్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేసిన రోజు సదరు ఇన్‌స్పెక్టర్‌ను సమాచారం అడిగితే తనకేమీ సంబంధం లేదని, కేసు నెంబర్ అడిగితే చెప్పానని, ఎవరు కేసు నమోదు చేస్తున్నారో కూడా తెలియదంటూ బదులిచ్చారు.

● ప్రతి సోమవారం నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో జరిగే పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి 80 కంటే తక్కువ ఫిర్యాదుదారులు రాని సందర్భాలు లేవు. వీటిలో 60 శాతం మంది ఫిర్యాదుదారులు తాము అన్యాయానికి గురయ్యామని, పోలీసుస్టేషన్‌లో న్యాయం జరగడం లేదంటూ తమ గోడు జిల్లా పోలీసు అధికారులకు విన్నవించుకుంటూనే ఉన్నారు.



ఎలాగో మారిపోతాం..

ఇంకెందుకు కేసులు!?

- నమోదుకు వెనుకడుగు... విచారణలో తీవ్రజాప్యం
- సిఫారసు ఉంటేనే ఎఫ్ఐఆర్ నమోదు
- స్టేషన్లలోనూ బాధితులకు దక్కని న్యాయం
- విమర్శలకు తావిస్తున్న కొంతమంది పోలీసు అధికారుల తీరు
- రోజురోజుకు క్షీణిస్తున్న శాంతిభద్రతలు
- కొత్త పోలీస్ బాస్ వచ్చినా.. గాడిన పడని పాలన

జిల్లాలో పోలీసుల తీరు ఇదండి. ప్రజలకు రక్షణగా నిలవాల్సిన పోలీసులే ముఖం చాటేస్తున్నారు. తమకు న్యాయం చేయండని మొరపెట్టుకున్నా బేఖాతరు చేస్తున్నారు. ఇందుకు గత ప్రభుత్వ పాలకుల వ్యవహార శైలీ లేదా నిర్లక్ష్యం తెలియదు కానీ బాధితుడికి మాత్రం అన్యాయం జరుగుతోంది. వైసీపీ పాలనలో అప్పటి ప్రజాప్రతినిధుల అడుగుజాడల్లో నడిచిన కొంతమంది పోలీసులు కేసుల నమోదులోనూ అలాగే వ్యవహరించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత కూడా వారిలో మార్పు రాలేదు. అప్పటి ఎస్పీగా ఉన్న తిరుమలేశ్వరరెడ్డిని ఎన్నికల విధుల నుంచి తొలగించడం, పలువురు అధికారులను బదిలీ చేయడం, కొత్త అధికారులు బాధ్యతలు చేపట్టడంతో సామాన్య ప్రజల బాధలను పట్టించుకోవడంలో నిర్లక్ష్యం వహించడం ప్రారంభించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసేలోపు ఎలాగో ప్రభుత్వం మారిన తరువాత కొత్త అధికారులు వస్తారు.. ఈలోపు కేసులు నమోదు చేయడం, వాటిని ఛేదించడం కోసం పరుగులు తీయడం ఎందుకు అనుకున్న అధికారులు జాప్యం చేయడం ప్రారంభించారు.



● స్టేషన్ల వద్ద నిరీక్షణ

'మాకు అన్యాయం జరిగింది మహాప్రభో..' అంటూ పోలీసుస్టేషన్ల మెట్లు ఎక్కి తమ గోడు వినిపించుకుంటున్నా కొందరు పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సీఐ లేదా ఎస్ఐల కోసం గంటల కొద్దీ స్టేషన్ల బయట ఎదురుచూస్తున్నా.. చివరకు ఆ అధికారి వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నా 'అవునా.. అలా జరిగిందా.. చూద్దాములే.. చేద్దాములే' అని వ్యంగ్యంగా మాట్లాడుతున్నారంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఇచ్చిన ఫిర్యాదుల పరిస్థితి ఏమిటని తెలుసుకునేందుకు కూడా రోజుల తరబడి స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నా సమాధానం చెప్పే వారు కనిపించడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

● కొత్త ప్రభుత్వం ఏర్పడినా!?

ఎన్నికల ప్రక్రియ పూర్తయి ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చినా పోలీసుల్లో మాత్రం మార్పు రానంటోంది. జిల్లాలో డివిజన్, సర్కిల్, పోలీసుస్టేషన్లలో ఉన్న అధికారులు 'ఎలాగో బదిలీ అయ్యే అవకాశం ఉంది. ఈ కొద్ది రోజులకు కేసులు నమోదు చేయడం, రికవరీ కోసం పరుగులు తీయడం ఎందుకని భావించి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా కేసులు నమోదు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి 45 రోజులు పూర్తవుతున్నా అధికారులను మార్చడంలో జాప్యం జరుగుతుండటం, ఫిర్యాదుదారుల నుంచి ఒత్తిడి పెరగడం, ఉన్నతాధికారులకు సమాధానాలు చెప్పలేక తూతూమంత్రంగా అధికారులు కేసు నమోదు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కేసులు నమోదు చేసినా వాటిని ఛేదించడంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేసేందుకు మక్కువ చూపడం లేదని ఏఎస్పీ స్థాయి అధికారులే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా కొంతమంది పోలీసు అధికారుల నిర్లక్ష్యం జిల్లాలో శాంతి భద్రతల విఘాతానికి పెద్ద కారణమవుతుంది. ఇటీవల జిల్లా పోలీసు బాస్‌గా బాధ్యతలు చేపట్టిన జీ కృష్ణకాంత్ అయినా పోలీసుస్టేషన్లలోని పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి అధికారుల పనితీరులో మార్పు వచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

- నెల్లూరు (క్రైం)



జీజీహెచ్ నిర్వహణకు రూ.3 కోట్లతో ప్రతిపాదనలు

- చిన్నపిల్లల విభాగానికే రూ.30 లక్షలు అవసరం
- పలు విభాగాలకు మరో రూ.70 లక్షలు

నెల్లూరు (వైద్యం), జూలై 24 : నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో (జీజీహెచ్) పలు విభాగాలలో నెలకొన్న పనుల నిర్వాహణకు రూ.3 కోట్లతో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)కు ప్రతిపాదనలు పంపనున్నారు. ఏపీఎంఎస్ఐడీసీ (ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఈ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇటీవల జరిగిన వీడియా కాన్ఫరెన్స్‌లో జీజీహెచ్‌లో పలు నిర్మాణాలు, మరమ్మతులకు సంబంధించి ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లు డీఎంఈ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఏ ఏ పనులకు ఎంత అవసరం అవుతుందో పూర్తి వివరాలతో కూడిన ప్రతిపాదనలు పంపాలని డీఎంఈ ఆదేశాలు జారీ చేశారు. దీనికి అనుగుణంగా ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేసి డీఎంఈకి పంపుతున్నారు. ఈ నిధులు వస్తే ఆసుపత్రిలో పలు సమస్యలు పరిష్కరించవచ్చని ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లు చెబుతున్నారు. ప్రధానంగా చిన్నపిల్లల విభాగంలో అభివృద్ధి పనులకే రూ.30 లక్షలు అవసరం అవుతుంది. అలాగే పల్మనాలజీ, ఐపీ బ్లాక్, పాత భవనంలో పలు నిర్మాణాలు, నిర్వాహణకు మరో రూ. 70 లక్షలు అవసరమని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆయా విభాగాలలో ఏసీ, లిఫ్ట్‌ల మరమ్మతులతోపాటు అగ్నిమాపక పరికరాల ఏర్పాటు, విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వాహణ, వివిధ ట్యాంకులకు మరమ్మతులు చేయాల్సి ఉంది. గురు, శుక్రవారాల్లో డీఎంఈకి ఈ ప్రతిపాదనలు పంపుతున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. డీఈఈ ఎస్ఎస్ రావు మాట్లాడుతూ తాము పంపిన ప్రతిపాదనల ప్రకారం నిధులు విడుదలయితే జీజీహెచ్‌లో అభివృద్ధి పనులు చేసే వీలు ఉంటుందని తెలిపారు.

సంగం హౌసింగ్ ఏఈ సస్పెన్షన్

సంగం, జూలై 24 : స్థానిక హౌసింగ్ ఏఈ షేక్ కరీముల్లాను కలెక్టర్ ఆనంద్ బుధవారం సస్పెండ్ చేశారు. పేదల గృహ నిర్మాణాల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన సిమెంట్, ఐరన్ లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా కరీముల్లా అక్రమాలకు పాల్పడినట్లు పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీంతో కలెక్టర్ స్పందించి ఉన్నతాధికారులతో విచారణ చేయించారు. 1829 సిమెంట్ బస్తాలు, 17,495 కేజీల ఇనుము పక్కదారి పట్టినట్లు విచారణ అధికారులు గుర్తించి కలెక్టర్‌కు నివేదికలు అందచేశారు. దీంతో ఏఈ కరీముల్లాను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

● జట్లకొండూరు కార్యదర్శి కూడా..

మనుబోలు : మండలంలోని జట్లకొండూరు పంచాయతీ కార్యదర్శి ఆత్మకూరు వెంకటరమణను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆనంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఓ ఇంజనీరింగ్ కళాశాలకు బోరు అనుమతులు, ఆస్తిపన్ను పత్రం తప్పుగా ఇచ్చే విషయమై కార్యదర్శిపై ఇద్దరు వ్యక్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ నెల్లూరు డీఎల్‌పీవోని విచారణకు ఆదేశించగా, వాస్తవమని తేల్చారు. ఈ మేరకు సస్పెన్షన్ ఉత్తర్వులను డీపీవో ఈవోఆర్‌డీ జీవీఎస్‌వీప్రసాద్‌కు కలెక్టర్ పంపారు. జట్లకొండూరు పంచాయతీతోపాటు మేజర్ పంచాయతీ అయిన మనుబోలుకు ఇన్‌చార్జి కార్యదర్శిగా, అక్కంపేట, బండేపల్లి పంచాయతీలకు డీడీవోగా వెంకటరమణ పని చేస్తున్నారు.

అటవీ శాఖలో ఇంటి దొంగలు

- పర్యవేక్షకులే ఎర్రచందనం భక్షకులు
- దుంగలు తరలిస్తూ టాస్క్‌ఫోర్స్‌కు పట్టుబడ్డ బేస్‌క్యాంప్ సిబ్బంది
- నలుగురి అరెస్టు.. పరారీలో ఒకరు
- తెరవెనుక ఉన్నవారిపై ఆరా



మర్రిపాడు, జూలై 24 : అటవీ శాఖలో ఇంటిదొంగల గుట్టురట్టవుతోంది. పర్యవేక్షకులే ఎర్రచందనం దుంగలను రవాణా చేస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ బృందం గుర్తించింది. కడప-నెల్లూరు జిల్లా సరిహద్దులోని వెలుగొండ అడవి నుంచి ఎర్రచందనం దుంగలు తరలిస్తూ బేస్ క్యాంప్ (తాత్కాలిక, ఒప్పంద ప్రాతిపదిక) సిబ్బందిలో నలుగురు సోమవారం రాత్రి టాస్క్ ఫోర్సు బృందానికి పట్టుబడ్డారు. మరొకరు పరారయ్యారు. ఓ ట్రాలీ ఆటోతో పాటు 64 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారు పడమటినాయుడుపల్లికి చెందిన రసూల్, ప్రసాద్, సింగణ పల్లికి చెందిన చిన్నా, వింజమూరుకు చెందిన ఒకరు ఉన్నారు. చుంచులూరుకు చెందిన ప్రసాద్ తప్పించుకున్నట్లు సమాచారం. ఆత్మకూరు రేంజ్ పరిధిలోని మర్రిపాడు మండలం కదిరి నాయుడుపల్లి, చాబోలు, కృష్ణాపురం, మర్రిపాడు, సింగణపల్లి బీట్లు ఉన్నాయి. ఈ ప్రాంతాల నుంచి అడవి కర్ర వంటి వాటిని ఎవరూ తీసుకెళ్లకుండా, ఇతరులు అడవిలోకి రాకుండా పర్యవేక్షణ కోసం 10మంది బేస్ క్యాంప్ సిబ్బందిని అధికారులు నియమించుకొని ఉన్నారు. అయితే, ఈ పర్యవేక్షకులే ఈ అక్రమాలకు పాల్పడుతున్నట్టు సోమవారం వెలుగుచూసింది. ఎర్రచందనం దుంగల రవాణాలో ఈ ఐదుగురే కాకుండా ఇంకా ఎవరైనా ఉన్నరా!? అన్న కోణంలో విచారిస్తూ వారి ఫోన్లను టాస్క్‌ఫోర్సు బృందం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పట్టుబడిన వారు ఇప్పటికే పలుమార్లు ఎర్రచందనం తరలించినట్లు గుర్తించింది.

నగర వాసులకు మెరుగైన సేవలు

- ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాల అమలుకు కృషి
- బాధ్యతల స్వీకరణలో కమిషనర్ సూర్యతేజ



బాధ్యతలు స్వీకరించిన అనంతరం తన పేరిట మొక్క నాటి నీరు పోస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు (సిటీ), జూలై 24 : నెల్లూరు నగర వాసులకు మెరుగైన సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని, తనను స్వయంగా కలుసుకుని ప్రజలు తమ సమస్యలు తెలియజేయవచ్చని నగర పాలక సంస్థ నూతన కమిషనర్ మల్లవరపు సూర్యతేజ అన్నారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కమిషనర్‌గా కలెక్టర్ ఆనంద్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలను అమలు చేసేందుకు చిత్తశుద్ధితో పని చేస్తానన్నారు. నెల్లూరు నగరాన్ని అన్నింటా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేసుకుని అందుకు అనుగుణంగా పని చేస్తానని చెప్పారు. అనంతరం కార్యాలయంలోని పలు విభాగాలను ఆయన పరిశీలించారు. కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌లను మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. కార్పొరేషన్ కార్యాలయంలో తన పేరిట మొక్కనాటిన ఆయన తోటి ఉద్యోగులు కూడా ఇదేబాటలో నడవాలని పిలుపునిచ్చారు. అనంతరం అన్నక్యాంటీన్ల ఏర్పాటుపై ఇంజనీరింగ్ అధికారులతో కమిషనర్ సమీక్షించారు. కాగ, కొత్తగా నియమితులైన ఎంహెచ్‌వో డాక్టర్ చల్లా చైతన్య కూడా బుధవారం బాధ్యతలు చేపట్టి, కమిషనర్‌తో భేటీ అయ్యారు.

కావలిలో కబ్జారాయుళ్లు

వివరాలు 7

జిల్లాకు 1,300 గోకులం యూనిట్లు

నెల్లూరు (వ్యవసాయం), జూలై 24 : పాడిరైతులకు ఆర్థిక చేయూత అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వ్యవసాయానికి అనుబంధంగా పాడిపరిశ్రమకు చేయూత అందిస్తూ 2014-19లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పురుడు పోసుకున్న గోకులం పథకాన్ని తిరిగి పాడిరైతులకు చేరువ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. జిల్లాకు సుమారు 1300 యూనిట్లు కేటాయించింది. జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి నిధులు మంజూరు చేయనున్నారు. ఇందులో సన్న, చిన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాకు కేటాయించిన యూనిట్లను మండలాల వారీగా కేటాయింపులు ఇంకా చేయలేదని అధికారులతో సమీక్షించి కేటాయింపులు చేస్తామని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కోటేశ్వరరావు తెలిపారు. కాగా, సొంత స్థలం కలిగిన వారే ఈ పథకానికి అర్హులు.

'అమృత్ భారత్'కు 3 రైల్వే స్టేషన్ల ఎంపిక

- నెల్లూరు, గూడూరు, సూళ్లూరుపేట
- ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జూలై 24 : ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని మూడు రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ పథకం కింద అభివృద్ధి చేయనున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ బుధవారం ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైల్వే బడ్జెట్‌లో ప్రత్యేకంగా విజయవాడ డివిజన్‌కు సంబంధించి 73 స్టేషన్లను ఈ పథకం లో చేర్చారు. ఈ జాబితాలో నెల్లూరుతో పాటు గూడూరు, సూళ్లూరు పేట రైల్వేస్టేషన్లు ఉన్నాయి. ఇప్పటికే పునరాభివృద్ధి పథకం ద్వారా రూ.102 కోట్లతో నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. తాజాగా బడ్జెట్‌లో అమృత్ భారత్ పథకం కింద ప్రత్యేక నిధులతో ఈ మూడు స్టేషన్లను అభివృద్ధి చేయనున్నట్లు కేంద్రమంత్రి ప్రకటించారు.



నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషనులో జరుగుతున్న అభివృద్ధి పనులు





ఈ గుంతలను ఎప్పుడు పూడ్చుతారో!?

పండుగ ముగిసింది.. చెత్త మిగిలింది!

బారాషహీద్ దర్గాలో ఎంతో ఆర్భాటంగా రొట్టెల పండుగను నిర్వహించిన అధికారులు ఆ తర్వాత పారిశుధ్యం మెరుగు పరచడంలో చేతులెత్తేశారు. పండుగ ముగిసి రెండు రోజులు గడిచిపోయాయి. అయితే, దర్గా ప్రాంగణంలో ఎటుచూసినా చెత్తకుప్పలు పేరుకుపోయాయి. వివిధ పనుల కోసం తవ్విన గుంతలను కూడా అలాగే వదిలేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రమాదాలకు నిలయాలుగా మారకముందే గుంతలు పూడ్చాలని, చెత్తాచెదారం తొలగించాలని భక్తులు కోరుతున్నారు

- స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, నెల్లూరు





గుట్టలు పేరుకుపోయిన చెత్తాచెదారం

చెయ్యో, కాలో విరిగితే అంతే!

- ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలలో అందని ఎక్స్‌రే సేవలు
- ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న బాధితులు

ఉదయగిరి రూరల్, జూలై 24 : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో కొన్నిరోజులుగా ఎక్స్‌రే యంత్రం పని చేయకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా కేంద్రానికి వంద కిలోమీటర్లు ఉండడం, కూలినాలీ చేసుకొనేవారు కావడంతో అధికంగా ప్రభుత్వ వైద్యశాలకు వెళుతుంటారు. ప్రతిరోజూ వివిధ రుగ్మతలతో బాధపడుతూ 150-200 మంది రోగులు వైద్యశాలకు వస్తుంటారు. అయితే కొన్ని రోజులుగా వైద్యశాలలో ఉన్న ఎక్స్‌రే యంత్రం మరమ్మతులకు నోచుకోక పోవడంతో వారికి అవస్థలు తప్పడంలేదు. ప్రధానంగా ప్రమాదాల్లో కాళ్లు, చేతులు విరిగిన క్షతగాత్రులు, జలుబు, దగ్గు, ఆయాసంతో బాధపడుతూ వైద్యశాలకు వెళుతున్న వారికి ఎక్స్‌రే తీయాల్సిన అవసరముంది. అయితే వైద్యశాలలో ఎక్స్‌రే పని చేయడంలేదని చెబుతండటంతో చేసేదిలేక ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి ఎక్స్‌రే తీయించుకుంటున్నారు. ఇలా పేదలు ఆర్థికంగా నష్టపోతున్నారు. వైద్యశాలలో కోట్ల రూపాయల విలువ చేసే పరికరాలు ఉన్నా సరైన వైద్యసేవలు అందడం లేదని పలువురు రోగులు బహిరంగ విమర్శలు చేస్తున్నారు. ఎక్స్‌రే యంత్రం ప్రతి మూడు నెలలకోసారి మరమ్మతులకు గురవుతుండడంతో రోగుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పని చేయని ఎక్స్‌రే యంత్రం

ఎక్స్‌రే లేక ఇబ్బందులు ఎదుర్కొన్న సంఘటనలు..

● దుత్తలూరు మండలం నందిపాడు గ్రామం వద్ద ఇటీవల ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తాపడి ఇద్దరి వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారికి కాలు విరిగిందో లేదో తెలుసుకొనేందుకు ఎక్స్‌రే తీయాలని క్షతగాత్రుని బంధువులు కోరగా యంత్రం చెడిపోయిందని సూచించడంతో వారు ప్రైవేటు వైద్యశాలలో ఎక్స్‌రే తీయించుకొన్నారు.

● ఉదయగిరి మండలం గండిపాళెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి కాలు నొప్పిగా ఉందని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాడు. అక్కడి వైద్యుడు పరీక్షలు నిర్వహించి ఎక్స్‌రే తీస్తే నొప్పి ఎందుకు వస్తుందో స్పష్టంగా తెలుస్తుందని తెలిపాడు. వైద్యశాలలో ఎక్స్‌రే లేకపోవడంతో ఆ వ్యక్తి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు వైద్యశాలలో నగదు వెచ్చించి ఎక్స్‌రే తీయించుకొని మరలా ప్రభుత్వ వైద్యశాలలో వైద్యుని వద్దకు వెళ్లి చూపించాల్సిన దుస్థితి నెలకొంది.

మరమ్మతులు చేయిస్తాం

వైద్యశాలలో ఉన్న డిజిటల్ ఎక్స్‌రే యంత్రం మరమ్మతులకు గురైన విషయం వాస్తవమే. ఇటీవల టెక్నీషియన్ వచ్చి పరిశీలించి వెళ్లారు. బ్యాటరీలు డెడ్ అయినందున యంత్రం పని చేయడం తలేదు. బ్యాటరీలు అమర్చి త్వరలో ఎక్స్‌రే సేవలు రోగులకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపడతాం.

- అనిషా, డీడీవో, ఉదయగిరి వైద్యశాల

నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలి

● ఉప ముఖ్యమంత్రికి ముత్తుకూరు సర్పంచి వినతి



సోమిరెడ్డి ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలిసిన ముత్తుకూరు ఉప సర్పంచి లక్ష్మి

ముత్తుకూరు, జూలై 24 : మేజర్ పంచాయతీ ముత్తుకూరులో వైసీపీ హయాంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని బుధవారం ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచి బూదూరు లక్ష్మి కలిసి కోరారు. తాను ఎస్టీ సామాజిక వర్గం యానాది కులానికి చెందిన దానినని, అప్పటి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి సూచనల మేరకు ఉప సర్పంచ్ కాకుటూరు అనితరెడ్డి, ఆమె భర్త లక్ష్మణరెడ్డి, వైసీపీ నాయకుడు ముత్యంగౌడ్, అప్పటి ఈవో చక్రం వెంకటేశ్వర్లు కలిసి దౌర్జన్యం చేసి అక్రమంగా నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. నిధుల దుర్వినియోగం ఇతర అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని, నిధులను రికవరీ చేసి పంచాయతీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, గిరిజన సర్పంచిగా తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈదూరు రామ్మోహన్ రెడ్డి, నీలం మల్లికార్జునయాదవ్, షేక్.అబ్దుల్ షఫీవుల్లా, తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువులో విషప్రయోగం

- మూడు లక్షల నష్టం

ముత్తుకూరు, జూలై 24 : చేపల చెరువులో విషం కలపడంతో చేపలన్ని చనిపోయిన సంఘటన మండలంలోని మామిడిపూడిలో బుధవారం చోటుచేసుకుంది. మామిడిపూడికి చెందిన టీడీపీ నాయకుడు కాకి బాబు చేపల చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు విషం కలిపారు. దీంతో చెరువులో సాగుచేస్తున్న రూప్ చంద్ చేపలు చనిపోయాయి. తనకు రూ.3లక్షల నష్టం వాటిల్లిందని, రాజకీయ కక్షతోనే ఈ పనికి పాల్పడి ఉంటారన్న అనుమానాన్ని బాధిత రైతు బాబు వ్యక్తం చేశారు. ఈమేరకు ముత్తుకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



విష ప్రయోగంతో చనిపోయిన చేపలు

చోరీకి గురైన మూగజీవాలు యజమానులకు అప్పగింత

వరికుంటపాడు, జూలై 24: మండలంలోని పెద్దిరెడ్డిపల్లిలో మూగజీవాలు చోరీకి గురైన సంఘటన బుధవారం వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కోగల నాగయ్య, అడుసుమల్లి తిరుపతయ్య, బొల్లిగొర్ల మహాలక్ష్మయ్యలకు చెందిన సుమారు రూ. 50 వేలు విలువ చేసే ఆరు గొర్రెలు మంగళవారం అర్ధరాత్రి చోరీకి గురయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు చోరీచేసి సమీప తూర్పుపాళెం గ్రామ శివారు ప్రాంతంలోని తాగునీటి పథకం గదిలో బంధించారు. రోజు మా దిరిగా తన మూగ జీవాలను తీసు కొని మేత కోసం అటుగా వెళ్లిన తొడుగుపల్లి గ్రామానికి చెందిన నక్కల రాజేంద్ర వాటి అరుపులతో గొర్రెలను గమనించి విషయాన్ని గ్రామస్థులకు తెలియజేశాడు. దీంతో పాముూరుపల్లి, పెద్దిరెడ్డిపల్లి తదితర గ్రామాలకు చెందిన ప్రజలు అక్కడికి చేరుకుని వాటిని యజమానులకు అప్పగించారు.



గదిలో బంధించిన గొర్రెలు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	130
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	232
స్కిన్‌లెస్	260
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6631
వెండి కిలో ధర	రూ. 87,000
వెండి ఒక గ్రాము	రూ. 89.00

విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించాలి

నెల్లూరు(విద్య): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఇంగ్లీష్ సబ్జెక్ట్‌పై కూడా పట్టు సాధించేలా వారిని తీర్చిదిద్దాలని డీఈవో రామారావు తెలిపారు. నగరంలోని సుంకు చెంగన్న పాఠశాలలో బుధవారం విభా లీవ్ ఫర్ వర్డ్ ఇంగ్లీష్ లిటరసీ కార్యక్రమంలో భాగంగా ఐదో తరగతి బోధించే ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంగ్లీష్ భాష ప్రపంచ భాషగా గుర్తింపు పొందిన తరుణంలో విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే దానిలోని మెళకువలు నేర్పించి ఇంగ్లీష్‌లో కూడా రాణించేలా సంసిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంవో జి.సుధీర్‌బాబు, నెల్లూరు అర్బన్ ఎంఈవో-2 సయ్యద్ అబ్దుల్ హమీద్, ప్రధానోపాధ్యాయుడు అరవింద్, ట్రైనీ టీచర్స్ నిహారిక, చందన, రవళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోమశిలలో 9.670 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, జూలై 24: సోమశిల ప్రాజెక్టు పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, బుధవారం నాటికి 9.670 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు తెలిపారు.

రైలు ప్రమాదస్థలం పరిశీలన



రైల్వేలైనును పరిశీలిస్తున్న అధికారులు

బిట్రగుంట, జూలై 24: బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలో మంగళవారం గూడ్సు వ్యాగిన్లు పట్టాలు తప్పిన ప్రమాద ఘటనా స్థలాన్ని బుధవారం పీడబ్ల్యూఐ అధికారులు పరిశీలించారు. బోగోలు ఎల్సీగేట్ 144 నుంచి ఘటనా స్థలం వరకు రైల్వేలైన్‌ను వారు పరిశీలించారు. లూప్ లైన్ క్రాస్ పాయింట్ నుంచి గూడ్సు రైలు పట్టాలు తప్పేందుకు గల కారణాలపై వారు ఆరా తీస్తున్నట్లు సమాచారం.కాగా మరోవైపు ఘటనా స్థలంలో లైన్‌ప్యాకింగ్ వర్కు ముమ్మరంగా సాగుతోంది.

కావలిలో కబ్జారాయుళ్లు

- ప్రభుత్వ భూముల్లో లేఅవుట్లు
- ప్రజల ఫిర్యాదుతో 60 ఎకరాల గుర్తింపు
- పంట కాలువలనూ చెరబట్టారు?
- సర్వే చేసి ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు
- ఆందోళనలో ప్లాట్ల కొనుగోలుదారులు

కావలి,జూలై24: పట్టణం చుట్టూ విలువైన ప్రభుత్వ స్థలాలను రియల్టర్లు ఆక్రమించి లేఅవుట్లు వేశారు. సుమారు 120 ఎకరాల ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని, వాటి సర్వే నంబర్లతోసహా రైతులు, పట్టణ ప్రజలు ఫిర్యాదులు చేశారు. వాటిపై విచారణ జరిపి సర్వే చేయటంతో ఇప్పటి వరకు 60 ఎకరాల వరకు ఆక్రమణలకు గురైనట్లు అధికారులు గుర్తించారు. సర్వే పూర్తయితే ఎంత మేరకు ఆక్రమణలకు గురి అయ్యాయో బయట పడుతోంది. ముఖ్యంగా పంట, వరవ, అడ్డ, వర్షపునీరు వెళ్లే కాలువలను ఆక్రమించి లేఅవుట్లు వేశారు. దీంతో పొలాలకు సాగునీరు వెళ్లేందుకు కాలువలు లేక, వరవ కాలువలు పూడ్చి వేయటంతో వర్షపు నీటితో పంటపొలాలు మునిగిపోతున్నాయి.

● ఎమ్మెల్యే ఆదేశాలతోనే..

ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు ఆక్రమణల పుట్ట పగిలింది. పట్టణానికి తూర్పు వైపున కాలువలను పూడ్చి లేఅవుట్లు వేసినందున వర్షాకాలం నీరు వెళ్లే మార్గం లేక కావలి ముంపునకు గురయ్యేది. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అండదండలతో వైసీపీ నేతలు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి లేఅవుట్లు వేశారు. వైసీపీ పాలనలో అధికారులు వాటిని నియంత్రించలేక పోయారు. టీడీపీ అధికారంలోకి రావటంతో ఎమ్మెల్యే దగుమాటి వెంటకక్రిష్ణారెడ్డి, ఆక్రమణ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అధికా రులు స్పందించి లేఅవుట్లలో అక్రమాలు గుర్తించి వాటికి మార్కింగ్ చేశారు.



మద్దూరుపాడు గరుడా లేఅవుట్‌లో పూడ్చేసిన కాలువను ఎక్స్‌కవేటర్‌తో తీయిస్తున్న మున్సిపల్ అధికారులు

● ఆందోళనలో కొనుగోలు దారులు

లేఅవుట్లలో ప్రభుత్వ స్థలాలను బయట కుతీసి పాత కాలువలను తిరిగి తవ్వుతుండటంతో ప్లాట్ల కొనుగోలుదారులు, వాటిని అమ్మిపెట్టిన మధ్యవర్తులు ఆందోళన చెందుతున్నారు. ఆక్రమణలు తొలగించి తిరిగి కాలువలను తీస్తుండటంతో లేఅవుట్ల రూపు రేఖలే మారిపోవటమే కాక పలువురి ప్లాట్లు గల్లంతు అవుతున్నాయి. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు.

● ప్రభుత్వ స్థలాలకు రక్షణ

తొలుత కావలి పెద్ద చెరువు నుంచి తాళ్లపాలెం చెరువు వరకు ఉన్న అడ్డకాలువ స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి బయటకు తీశారు. మరలా స్తబ్దుగా ఉండటంతో ఉన్నతాధికారుల నుంచి ఎమ్మెల్యే నుంచి ఒత్తిడిలు రావటంతో మూడు రోజులుగా మళ్లీ లేఅవుట్లలో ఉన్న కాలువలను బయట కుతీసి తవ్వుతున్నారు. తుమ్మలపెంట రోడ్డులో ఉన్న లంబోధర లేఅవుట్‌లో సోమవారం నాలుగు ఎక్స్‌కవేటర్లను పెట్టి నీటిపారుదల శాఖ అధికారులు కాలువలను తవ్వారు. మంగళవారం మద్దూరుపాడు రోడ్డులో ఉన్న గరుడా లేఅవుట్‌లో అధికారులు ఎక్స్‌కవేటర్‌తో కాలువను తీస్తున్నారు. ఇలా పట్టణంలోని వ్యవసాయ భూముల్లో ఉన్న అన్ని కాలువలను బయటకు తీసున్నారు.

లేఅవుట్ల మధ్యలో గుర్తించి తవ్విన అడ్డకాలువ



వ్యవసాయ కూలీల కడుపుకొట్టిన కేంద్రం

- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం



మాట్లాడుతున్న మంగళం పుల్లయ్య

నెల్లూరు(వైద్యం), జూలై 24 : కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మల సీతారామన్ సోమవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్ గ్రామీణ కూలీల కడుపుకొట్టే విధంగా ఉందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశానికి అన్నం పెడుతున్న వ్యవసాయ రంగంలో కీలకంగా ఉన్న వ్యవసాయ కూలీలకు నష్టం కలిగించే విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు చేశారన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం వల్ల కూలీలకు ఎంతో ఉపయోగపడేదని, అయితే 10 ఏళ్లలో దీన్ని కేంద్రం నిర్వీర్యం చేసిందన్నారు. ఈ పరిస్థితిలో పనులు తగ్గి రైతు కూలీలు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే వ్యవసాయ రంగానికి రూ.2 లక్షల కోట్లు అవసరం కాగా బడ్జెట్‌లో కేవలం రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ అంకమరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద 200 రోజులు పని కల్పించి కనీస వేతనం రోజుకు రూ.600 వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లాలో మూడు చోట్ల డీ సిల్టింగ్



సంగం వద్ద పెన్నానదిలో ఇసుక డీ సిల్టింగ్ కోసం పరిశీలిస్తున్న అధికారులు

సంగం, జూలై 24: జిల్లాలోని పెన్నా నదిలో సంగం, సూరాయపాళెం, నెల్లూరులో ఇసుక డీసిల్టింగ్ తీసేందుకు అనువుగా ఉన్నట్లు గుర్తించినట్లు ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణ మోహన్ తెలిపారు. బుధవారం ఆయన మైనింగ్ అధికారులతో కలిసి సంగం పెన్నానదికి ఎగువ ప్రాంతంలో ఉన్న డీ సిల్టింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఇసుక నూతన పాలసీ ప్రకారం ఇసుక రేవులను గుర్తించేందుకు మైనింగ్, ఇరిగేషన్ ఉమ్మడిగా కార్యాచరణ చేపట్టామన్నారు. ఇక నుంచి రెండు శాఖల సమన్వయంతో ఇసుక రీచ్‌ల పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. అయితే గతంలో మాదిరిగా కాకుండా పర్యావరణశాఖ అనుమతుల మేరకు యంత్రాలు వినియోగించకుండా డ్రెజ్జింగ్ విధానంలో (నీటిలో పడవల ద్వారా) ఇసుక తీసి డంపింగ్ యార్డ్‌లకు తరలించాల్సి ఉంటుందని తెలిపారు. వర్షాకాలంలో సైతం ఇసుక కొరత లేకుండా డ్రెజ్జింగ్ విధానంలో ఇసుక తీస్తామన్నారు. కార్యక్రమంలో ఈఈ నాగరాజు, డీఈ విజయభాస్కర్‌రెడ్డి, ఏఈ బీవీ కృష్ణ, మైనింగ్ డీడీ, సిబ్బంది పాల్గొన్నారు.

లైసెన్సులను రెన్యూవల్ చేయండి

● రెవెన్యూ మంత్రిని కోరిన సర్వేయర్లు



మంత్రికి వినతిపత్రం అందచేస్తున్న లైసెన్సు సర్వేయర్లు

నెల్లూరు(సిటీ), జూలై 24 : వైసీపీ ప్రభుత్వంలో రెన్యూవల్‌కు నోచుకోని తమ విజ్ఞప్తులను ఆచరణలోకి తీసుకుని రెన్యూవల్ చేసి ఉపాధి అవకాశాలు చూపాలని జిల్లాకు చెందిన లైసెన్సు సర్వేయర్లు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రతో కలిసి బుధవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ఆయనకు వినతిపత్రం అందచేసినట్లు ఆ సంఘం నేత నంబి సురేష్ తెలిపారు. గత టీడీపీ హయాంలో రూ.40 కోట్లు వెచ్చించిన సీఎం చంద్రబాబు మాలాంటి వాళ్లందరికి సర్వేపై సాంకేతికపరంగా శిక్షణ ఇచ్చారని తెలిపారు. అనంతరం తహసీల్దారు కార్యాలయాల్లో సహాయ సర్వేయర్లుగా నియమించాలని ఆలోచన చేస్తున్న సమయంలో ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. తమపై టీడీపీ ముద్రవేసి ఆఖరికి లైసెన్సులు కూడా రెన్యూవల్ చేయకుండా పక్కన పెట్టేశారని వాపోయారు. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు తాతరావు, ముత్యంగౌడ్, రఫీ, సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు సమర్థత వల్లే ఏపీకి నిధులు

- ప్రతిపక్ష హోదా కోసం జగన్ కోర్టుకు వెళ్లడం సిగ్గుచేటు
- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

నెల్లూరు(వైద్యం), జూలై 24 : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమర్థత వల్లే కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి నిధులు వచ్చాయని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధికారంలో ఉండగా జగన్ కేసుల మాఫీ కోసం ఢిల్లీ చుట్టూ తిరిగారన్నారు. చిన్నాన్న కేసులో అవినాష్‌రెడ్డిని కాపాడేందుకు ప్రధాని మోదీ కాళ్లమీద పడ్డారని దుయ్యబట్టారు. అయితే సమర్థవంత నాయకత్వం ఉంటే ఏపీకి భారీగా నిధులు వస్తాయని చంద్రబాబు నిరూపించారన్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రి నిధులు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ఏపీకి క్యూ కడుతున్నారని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి రాజకీయ జీవితాలకు బాటలు వేసిన కడప జిల్లా అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. వెనుక బడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేలా చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. ఇదిలా ఉంటే ప్రతిపక్ష హోదా కోసం జగన్ హైకోర్టుకు వెళ్లడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రజలు ఆయన్ను ఛీ కొట్టినా ఇంకా బుద్ధి రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కువ్వారపు బాలాజీ, మొయినుద్దీన్, పెంచల బాబు, బ్రహ్మానాయుడు, నవీన్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మన్‌పై దాడి

పోలీసులకు ఫిర్యాదు



విద్యుత్ శాఖాధికారులతో వాగ్వాదం చేస్తున్న పామంజి బాలసుబ్రహ్మణ్యం తనయుడు

విడవలూరు, జూలై 24 : మండల పరిధిలోని ఊటుకూరు సబ్‌స్టేషన్‌లో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న మడపర్తి నవీన్‌పై వెంకటరెడ్డిపాలెం కు చెందిన పామంజి బాలసుబ్రహ్మణ్యం, పామంజి సునీల్ దాడి చేశారని విద్యుత్ శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ ఏఈ శ్రీనివాసులు బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో డీఈఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వెంకటరెడ్డిపాలెం కాలనీలో మొండి బకాయిలను వసూలు చేయడానికి బుధవారం ట్రాన్స్‌కో అధికారులు ఎం నవీన్, కృష్ణ, జనార్ధన్‌లు వెళ్లారు. పామంజి బాలసుబ్రహ్మణ్యం గత ఆరు నెలలుగా విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడంతో చెల్లించాలని అధికారులు కోరారు. ఈ క్రమంలో విద్యుత్ శాఖ అధికారులకు బాలసుబ్రహ్మణ్యం మధ్య వాదోపవాదాలు జరిగాయని ఆయన తెలిపారు. ఈక్రమంలో బాలసుబ్రహ్మణ్యం వరుసకు తమ్ముడైన సునీల్ విద్యుత్ శాఖాధికారులపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో లైన్‌మెన్ సునీల్‌కి గాయాలవడంతో పాటు అతని మెడలో ఉన్న బంగారు చైన్ తెగి కిందపడి కనిపించకుండా పోయిందన్నారు. ఈమేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, అధికారులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు ఆధార్ కార్డులు మంజూరు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందచేస్తున్న నేతలు

నెల్లూరు (విద్య), జూలై 24 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆధార్ స్పెషల్ డ్రైవ్ సెంటర్లలో ఎటు వంటి డాక్యుమెంట్స్‌లేని ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు ఆధార్ కార్డులు మంజూరు చేయాలని బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మాసా ప్రసాద్ కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కలసి వినతిపత్రం అందచేసి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు ఆధార్ లేక తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పదివేల మంది ఆధార్‌లేని వారిని గుర్తించా మన్నారు. వారికి తహసీల్దార్ల ద్వారా లేట్ రిజిస్ట్రేషన్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌ను మంజూరు చేసి ఆధార్ జారీ చేసే డ్రైవ్ చేపట్టామన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని అందరికీ ఆధార్ వచ్చే విధంగా చర్యలు చేపడుతున్నామని, అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు బీటీఏ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీటీఏ నేతలు ఆదినారాయణ, ఖాజా రహంతుల్లా, పెంచలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న ధోబీ పోస్టులు భర్తీ చేయాలి

● రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య

నెల్లూరు(వైద్యం), జూలై 24 : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న ధోబీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన రజక వృత్తి దారుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. మోడరన్ ధోబీఘాట్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. అనేక మంది రజకులు ఉపాధి లేక గ్రామీణ యువత పట్టణాలకు వలస వెళుతున్నారని, అక్కడ అపార్టుమెంట్లు, ఇతర విభాగాల్లో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వారిని ఆదుకునేందుకు తగిన కృషి చేయాలన్నారు. వృత్తిదారులకు 200 యూనిట్ల విద్యుత్‌తో పాటు 50 ఏళ్లు నిండిన వారికి పెన్షను మంజూరు చేయాలని కోరారు. జిల్లా కమిటీ అధ్యక్షుడు నేరేళ్ల శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చేతివృత్తి దారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కటికాల వెంకటేశ్వర్లు, వృత్తి సంఘాల జిల్లా నేత గుంజి దయాకర్, రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేకులగుంట అంకయ్య, దేవరకొండ వెంకటేశ్వర్లు, వేదవతమ్మ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరు : ఇన్‌చార్జి ఎంపీడీవో ఉషారాణికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు


చేజర్ల : ఎంఈవో-2కి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ సభ్యులు


అనంతరసాగరం : తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : యూటీఎఫ్

ఆత్మకూరు, జూలై 24 : విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాధరం కోరారు. బుధవారం స్థానిక నేతలతో కలిసి ఇన్‌చార్జి ఎంపీడీవో టీ ఉషారాణికి, ఎంఈవో చలపతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 117ను రద్దుచేయాలని, ప్రీప్రైమరీతో పాటు 1 నుంచి 5 తరగతులను ఒకే పాఠశాలలో నిర్వహించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్‌ను, ఒకే పరీక్ష విధానాన్ని అమలు చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో నేతలు మోహన్‌రావు, ఖాదర్‌బాష, హరికృష్ణ, మురళీకృష్ణ, జిలాని, బీ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల : ఎంఈవో-2 డీసీ మస్తానయ్యకు యూటీఎఫ్ నాయకులు ఆర్‌వీ.కృష్ణారెడ్డి ఎస్.రమణయ్య, తదితరులు వినతిపత్రం అందజేశారు.

అనంతసాగరం : తహసీల్దారు నరసింహరావు, ఎంపీడీవో తాజ్ మస్రూర్‌లకు యూటీఎఫ్ నాయకులు వెంకటేశ్వర్లురెడ్డి, మహబూబ్‌బాష, రంతుల్లా, సుబ్బరాయుడు, తాజ్‌వుద్దీన్ తదితరులు వినతిపత్రం అందించారు.

వరికుంటపాడు : విద్యా, రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల్లో నాయకులు వినతిపత్రాలు అందజేశారు. యూటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, కరీముల్లా, సుబ్రమణ్యం, సుబ్బారావు, హరిశ్చంద్రప్రసాద్, కాంతారావు, దామోదరరావు, రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దారుగా జహీర్‌ఖాన్


జహీర్‌ఖాన్

ఉదయగిరి రూరల్, జూలై 24: మండల ఇన్‌చార్జి తహసీల్దారుగా షేక్ జహీర్‌ఖాన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు నెహ్రూ బాబు బాపట్ల జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో ఉన్నతాధికారులు కార్యాలయంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న జహీర్‌ఖాన్‌ను ఇన్‌చార్జి తహసీల్దారుగా నియమించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

తూము మరమ్మతులు పూర్తి

అనంతసాగరం, జూలై 24: ఎట్టకేలకు అనంతసాగరం చెరువు మొదటి తూము మరమ్మతులు పూర్తయినట్లు టీడీపీ మండలాధ్యక్షురాలు మునగపాటి సునీత, నాయకులు చల్లా శివారెడ్డి, కేతా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో ఈ పనులు జరిగాయన్నారు. దీంతో బుధవారం కాలువకు నీరు విడుదల చేసినట్లు చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

అనంతసాగరం, జూలై 24: తమ కాలనీలోని ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అనంతసాగరం గిరిజన కాలనీవాసులు బుధవారం సీపీఎం నాయకులతో కలసి ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కాలనీలో రోడ్లు అధ్వానంగా ఉన్నయని, కాలనీలో విద్యుత్ సదుపాయం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా కొంత మేరకు పైపులు వేసి కాంట్రాక్టర్ వెళ్లిపోవడంతో నీటి సమస్యతో అల్లాడుతున్నామని చెప్పారు. అనంతరం ఎంపీడీవో తాజ్‌మస్రూర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అన్వర్‌బాష, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో భారీ అవినీతి

చేజర్ల, జూలై 24: పుట్టుపల్లిలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో భారీ అవినీతి జరిగిందని సర్పంచి అమ్మినేని పురుషోత్తం నాయుడు పేర్కొన్నారు. బుధవారం గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. స్థానిక నాయకులతో ఫీల్డ్ అసిస్టెంట్ కలిసి పక్కా అవినీతికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై ఏపీవోకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అలాగే జగనన్న కాలనీలో బేస్‌మెంట్ వరకు పూర్తయితే శ్లాబు వరకు అయినట్లు బిల్లులు మంజూరు చేసుకుని దాదాపు రూ. 18 లక్షలకు పైగా అవినీతికి పాల్పడినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగిన అవనీతిపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పొదుపును అలవాటు చేసుకోవాలి

దుత్తలూరు (ఉదయగిరి రూరల్) : పల్లెప్రజలు పొదుపును అలవాటు చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఉదయగిరి పోస్టల్ ఇనస్పెక్టర్ సాయికృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నందిపాడు సబ్ పోస్టాఫీసు పరిధిలోని తిమ్మానాయుడుపేట బ్రాంచ్ పోస్టా ఫీసునందు తపాలా బీమా తీసుకొని మరణించిన కుటుం బ సభ్యులకు నగదు చెక్కులు పంపిణీ చేశారు. నందిపాడు సబ్ పోస్టుమాస్టర్ రేవూరు పెంచల నరసయ్య, బీపీఎం పెంచలనరసింహులు, ఏబీపీఎం ఖా జారంతుల్లా పాల్గొన్నారు.

మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసు

సంగం : మూడవ సచివాలయం పరిధిలోని వెంకటేశ్వరపురంలో పంచాయతీ అనుమతి లేకుండా నిర్మిస్తున్న భవన నిర్మాణదారుడికి బుధవారం ఈవోఆర్డీ నోటీసులు అందచేశారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పంచాయతీ అనుమతి లేకుండా భవనాన్ని నిర్మిస్తున్నాడు. దీనిపై జూన్ 16న నిర్మాణదారుడికి నోటీసు అందచేశారు. అయినా లెక్కచేయకుండా పునాదులు ప్రారంభించారు. వాటిని పూడ్చాలని ఈనెల 15న రెండో నోటీసు అందచేశారు. నోటీసు తీసుకోకపోవడంతో పాత ఇంటి ప్రహరీకి అంటించారు. అయినా మళ్లీ బుధవారం నోటీసు ఇచ్చారు. మూడు రోజుల్లోపు వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు.

మొక్కుబడిగా ప్రత్యేక గ్రామసభలు

కలువాయి : తాగునీరు, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక గ్రామసభలను మొక్కుబడిగా జరుపుతున్నారు. అన్నీ గ్రామాల్లోనూ ఈనెల 26 వరకు ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలి. ఈ సభలకు కీలకమైన మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ డుమ్మా కొట్టడం గమనార్హం. బుధవారం కలువాయిలో జరిగిన గ్రామసభకు కూడా ఆయన రాకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి మొక్కుబడి గ్రామసభల వల్ల ఉపయోగం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

మంత్రి లోకేష్‌తో టీడీపీ నేత కొమ్మి భేటీ



చేజర్ల, జూలై 24: రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌ను మం గళవారం రాత్రి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమ్మి లక్ష్మయ్య నాయుడు వెలగపూడిలోని సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులపై ఆయన చర్చిం చారు. లోకేష్‌ను కలిసిన వారిలో డాక్టర్ కొమ్మి ప్రదీప్, టీడీపీ నేత నరసింహారావులు కూడా ఉన్నారు.

● **ఉదయగిరి రూరల్:** రాష్ట్ర వ్యవసా య శాఖా మంత్రి కింజ రపు అచ్చెన్నాయుడిని బుధవారం సచివాలయం లో రాష్ట్ర స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్షుడు పీవీ రమణయ్య మర్యాదపూర్వ కంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో చేస్తున్న సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను వివరించారు. మంత్రిని కలిసిన వారిలో స్వచ్ఛంద సంస్థల రాష్ట్ర కార్యదర్శి వీకే ప్రకాష్, సలహాదారు మామిడిపల్లి బాలగంగాధర్, కార్యవర్గ సభ్యుడు వెంకటశ్రీనివాస్ తదితరులున్నారు.

బీసీ బాలికల గురుకులం మంజూరు

● త్వరలోనే ఆత్మకూరులో ప్రారంభం


ఆత్మకూరులో పాత మున్సిపల్ భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు, జూలై 24 : ఆత్మకూరుకు బీసీ బాలికల గురుకుల పాఠశాల మంజూరైంది. అయితే నిర్వహణకు భవనాలు కొరవడ్డాయి. దీనికితోడు అద్దె భవనాలు సైతం అందుబాటులో లేక, ఆరేళ్లుగా ప్రాంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో యుద్ధప్రాతిపదికన గురుకుల పాఠశాల ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే 50 మంది 5వ తరగతి విద్యారులకు సీట్లు ఖరారయ్యాయి. విజయలక్ష్మిని ప్రిన్సిపాల్‌గా నియమించారు. త్వరితగతిన తరగతులు ప్రారంభించాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సైతం ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గురుకులం ప్రారంభానికి అనువైన భవనం కోసం అధికారులు వెతుకులాట ప్రారంభించారు. ఈ క్రమంలో ఆర్డీవో కే మధులత, జిల్లా బీసీ సంక్షేమశాఖాదికారి వై వెంకటయ్య, ఏబీసీడబ్ల్యూ ఎం శ్రీదేవి బుధవారం ఆత్మకూరులో పలు భవనాలను పరిశీలించారు.

త్వరలో ప్రారంభిస్తాం

ఆత్మకూరులో త్వరలో బీసీ బాలికల గురుకుల పాఠశాలను ప్రారంభిస్తాం. అందుకు అనువైన భవనం కోసం వెతుకులాడుతున్నాం. అనుకూలమైన భవనం ఎంపిక చేసిన వెంటనే గురుకులాన్ని ప్రారంభిస్తాం.

- వై వెంకటయ్య, జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి

ప్రతి ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండాలి

సీతారామపురం, జూలై 24: మండల పరిధిలోని సింగారెడ్డిపల్లి గ్రామ పంచాయతీలోని సచివాలయం వద్ద సర్పంచ్ దుర్గం సంపూర్ణ అధ్యక్షతన బుధవారం ఓడీఎఫ్, జలజీవన్ అంశాలపై గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుర్గం సంపూర్ణ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండాలని ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామనాధరెడ్డి, ఈఓపిఆర్‌డి భార్గవి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి


వరికుంటపాడు : ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మరుగుదొడ్ల గుర్తింపు సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రత్యేక ఆధార్ శిబిరాలపై ప్రజలకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకొనేలా చూడాలన్నారు. అనంతరం పంచాయతీల వారీగా నివేదికలను సేకరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనీమస్సి ఈవోపీఆర్డీ సికిందర్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గంధ మహోత్సవ గోడపత్రికల ఆవిష్కరణ


గంధమహోత్సవం గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న దర్గా కమిటీ

ఉదయగిరి రూరల్, జూలై 24: స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఉన్న హజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఖాదరీ ఔలియా వారి 219వ గంధమహోత్సవం గోడపత్రికలను బుధవారం ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా దర్గా కమిటీ మాట్లాడుతూ వచ్చేనెల 2న సందల్‌మాలి కార్యక్రమంతో గంధమహోత్సవం ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు రోజ్‌ధార్ మన్సూర్, కార్యదర్శి ఖాదర్‌బాషా, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ రియాజ్, కావ్య ట్రస్టు ప్రతినిధి సికిందర్, లియాఖత్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎంపీటీసీ మృతి


మాదాల రామచంద్ర(ఫైల్)

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 24: మండలం లోని నర్రవాడ ఎంపీటీసీ, టీడీపీ సీనియర్ నాయకులు మాదాల రామచంద్ర (60) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. పని నిమిత్తం గత మూడు రోజుల క్రితం విజయవాడకు వెళ్లారు. ఈ క్రమంలో ఆకస్మా త్తుగా గుండెపోటు రావడంతో సహచరులు హుటాహుటిన ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. ఆయన మృతిపట్ల మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు.

మాదాల మృతి బాధాకరం : కాకర్ల

ఉదయగిరి రూరల్, జూలై 24: దుత్తలూరు ఎంపీటీసీ మాదాల రామచంద్ర మృతి బాధాకరమని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. విజయవాడలో గుండెపోటుకు గురై ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మాదాల మృతిచెందడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అసెంబ్లీ నుంచి హుటాహుటిన వైద్యశాలకు వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు. మాదాల మృతి తెలుగుదేశం పార్టీకి తీరనిలోటని, వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు.

దుత్తలూరు మండలం నర్రవాడ ఎంపీటీసీ, టీడీపీ సీనియర్ నాయకుడు మాదాల రామ చంద్ర మృతి బాధాకరమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కలిగిరిలో ట్రాఫిక్ కష్టాలు

● పట్టించుకోని అధికారులు ● ప్రజల అవస్థలు

కలిగిరి, జూలై 24: పట్టణంలోని ప్రధాన కూడలి ప్రాంతమైన కలిగిరమ్మ ఆలయం వద్ద ప్రతినిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో బాగా రద్దీగా ఉంటుంది. ఈ ప్రాంతంలో కూరగాయల మార్కెట్, వాణిజ్య దుకాణ సముదాయాలు, హోటళ్లు ఉండడంతో జనసంచారం బాగా ఉంటుంది. ఈ ప్రదేశం నుంచే విజయవాడ, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాలకు మండలవాసులు ప్రయాణం చేస్తారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి ఒక్క కానిస్టేబుల్ కూడా కనిపించడు. కూరగాయల దుకాణాల ముందు నడిరోడ్డుపై ఆటోలు నిలిపి, కూరగాయలను దించడం, తరలించడం చేస్తారు. ఈ క్రమంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. కూతవేటు దూరంలో పోలీస్‌స్టేషన్ ఉన్నా వారు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పోలీసుశాఖ సిబ్బందిని నియమించి ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలని మండల వాసులు కోరుతున్నారు.


కూరగాయల దుకాణాల వద్ద రోడ్డుపై అడ్డదిడ్డంగా ఆటోలు

సొంత జిల్లాలకు వెళుతున్న తహసీల్దార్లకు సన్మానం

కావలి,జూలై 24: తహసీల్దార్ నగేష్ సొంత జిల్లా పల్నాడుకు బది లీ కావడంతో బుధవారం ఎన్డీఏ కూటమి నేతలు ఆయన్ను సత్కరిం చారు. తహసీల్దార్ నిజాయితీగా పనిచేసి ప్రశాంతంగా, సజావుగా ఎన్ని కలు జరిగేందుకు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నే తలు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, గుంటుపల్లి రాజకుమా ర్‌చౌదరి, చవల రామకృష్ణ, గాదంశెట్టి వేణు, పల్లపు మోహన్, జనసేన నేత పొబ్బాసాయి విఠల్, తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం : ఎన్నికలకు ముందు బాపట్ల జిల్లా నుంచి బదిలీ పై వచ్చిన తహసీల్దార్ జీ శ్రీచరణ్ బుధవారం రిలీవ్ అయ్యారు.ఈ సందర్భంగా కార్యాలయంలోని డీటీ టీ ప్రసాద్, వీఆర్‌వోలు, సిబ్బంది ఆయన్ను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు.తనకు సహకరించిన సిబ్బం దికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అల్లూరు : తహసీల్దార్ దుర్గేశ్వరరావు బదిలీ అయ్యారు. ఆయనకు బుధవారం కార్యాలయ సిబ్బంది కార్యాలయంలో ఆయనకు ఘనంగా సత్కారం చేశారు. కార్యక్రమంలో డీటీ నాగలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ సుధీర్, వీఆర్వోలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : తహసీల్దార్ మస్తానయ్యను ఎంపీడీవో సుజాత కార్యాలయ సిబ్బంది బుధ వారం ఘనసన్మానం చేశారు. కార్యక్రమంలో డీటీ కోటేశ్వరరావు, ఆర్‌డబ్లూఎస్ ఏఈ జిలానీ బాషా, వీఆర్‌వోలు సిబ్బంది పాల్గొన్నారు.

కందుకూరు : ఎన్నికల్లో సబ్ కలెక్టరు కార్యాలయ డీఏవోగా బాధ్యతలు నిర్వహించి గుంటూరు జిల్లాకు బదిలీ అయిన తహసీల్దార్ కే రవిబాబుకు బుధవారం రాత్రి ఘనంగా వీడ్కోలు పలికారు. సబ్ కలెక్టరు జీ విద్యాధరి, కార్యాలయ సిబ్బంది ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు మాట్లాడుతూ ఏ చిన్న అవాంఛనీయ ఘటన జరగకుండా ఎన్నికలను పూర్తిచేయటంలో ఆయన కృషి ఎంతో ఉందన్నారు.

● **సంగం :** తహసీల్దారు రమాదేవి బదిలీ కావడంతో కార్యాలయం సిబ్బంది బుధవారం ఘనంగా సత్కరించారు. ఎన్నికల విధుల్లో భాగంగా ప్రకాశం జిల్లాకు చెందిన రమాదేవి ఆరు నెలల కిందట సంగ తహసీల్దారుగా నియమితులయ్యారు. బదిలీపై వెళ్తున్న రమాదేవి దంపతులను కార్యాలయ అధికారులు, సిబ్బంది పూలమాలలతో సత్కరించారు.

● **ఉదయగిరి రూరల్ :** ఉదయగిరి తహసీల్దారుగా విధులు నిర్వహిస్తూ బదిలీపై బాపట్ల జిల్లాకు వెళ్లిన కె నెహ్రూబాబును బుధవారం అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు జహీర్‌ఖాన్, సీనియర్ అసిస్టెంట్ సందానీ, వీఆర్వోలు వెంకట్, జాఫర్, అంజాద్, బిల్లుపాటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం

వింజమూరు, జూలై 24 : రాధాకృష్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాల చాకలికొండలో శిక్ష సప్తాహ్‌లో భాగంగా క్రీడాదినోత్సవాన్ని వ్యాయామ ఉపాధ్యాయుడు వెలుగోటి కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆటలను నిర్వహించి వాటి ప్రాముఖ్యతను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పి విజయకుమారి, ఏ సుభాషిణి, టి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు కౌలు వేలం

లింగసముద్రం, జూలై 24: మండలంలోని పెదపవనిలో గల వేణుగోపాలస్వామి, మల్లీశ్వరస్వామి ఆలయ భూములకు బుధవారం కందుకూరు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వంశీ, ఈవో అన్నమ్మలు చైర్మన్ ముత్తినేని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కౌలు వేలం నిర్వహించారు. గ్రామంలో ఈ ఆలయాలకు 107 ఎకరాల మాన్యం భూములు ఉన్నాయి. వేలంపాటలో మొత్తం 47 ఎకరాలకు రూ.2 లక్షలు పలికింది. కౌలు ఏడాదిపాటు ఉంటుందని ఇన్‌స్పెక్టర్ వంశీ చెప్పారు.మిగిలిన 60 ఎకరాలకు త్వరలో వేలం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ఎం బాజీబాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపరచాలి

కొండాపురం, జూలై 24: విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపరచేందుకు కృషిచేయాలని ఎంఈవో కే.రవికుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పలు పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఆదిమూర్తిపురం ప్రధాన ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అభ్యసనాసామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలోని రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించాలని ఉపాధ్యాయులకు తెలిపారు.


బడ్జెట్‌లో సామాన్యుడికి శూన్యహస్తం

ఉలవపాడు, జూలై 24 : సంపన్నులకు వరాలు... సామాన్యులకు శూన్యహస్తం అందించినట్లుగా కేంద్ర బడ్జెట్ ఉందని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్ మోహన్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వ్యవసాయ రంగం, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతోపాటు కీలక రంగాలకు బడ్జెట్‌లో కోత విధించడాన్ని వ్యతిరేకిస్తూ పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకానికి నిధులు రూ.2 లక్షల కోట్లకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యార్థుల సమగ్ర వికాసానికే శిక్షా సప్తాహ్

కావలిటౌన్, జూలై 24: విద్యార్థుల సమగ్ర వికాసం కోసమే శిక్షా సప్తాహ్ కార్యక్రమమని డిప్యూటీ డీఈవో రఘురామయ్య పేర్కొన్నారు. బుధవారం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పిల్లలకు సాంప్రదాయ ఆటల పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థికి విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక, సామాజిక సేవాకార్యక్రమాల పట్ల పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఉపాధ్యాయిని సుమతి స్వయంగా పిల్లలకు చికెన్ బిర్యానీ ఏర్పాటు చేయగా, ఎంఈవో-2 వెంకటసుబ్బయ్యతో కలిసి ఆయన వడ్డించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని నీరజ, పీడీ చిరంజీవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రెండు ట్రాక్టర్ల పట్టివేత



లింగసముద్రం, జూలై 24: మండలంలోని అంగిరేకులపాడు మన్నేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం కందుకూరు సెబ్ అధికారులు, సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు ఉదయం 10 గంటలకు సెబ్ ఎస్సై దీప్తి కరంత్, సిబ్బంది పెదపవని గ్రామ శివారులో ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సెబ్ ఎస్సై దీప్తి కరంత్ ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం బాజీబాబు కేసు నమోదు చేశారు.

ఫ్యాన్ల బహూకరణ

కందుకూరు, జూలై 24: పట్టణంలోని అయ్యప్ప స్వామి గుడివద్ద నిర్మిస్తున్న అన్నప్రసాద వితరణ భవనానికి దోనపల్లి రామారావు,లలితకుమారి దంపతులు 11 ఫ్యాన్లను బుధవారం బహూకరించారు. అయ్యప్పస్వామి సేవా సంఘం ప్రతినిధులు నలబోతుల మురళి, మాదాల వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామిలకు వాటిని అందజేశారు.

జగన్ డ్రామాలు కట్టిపెట్టాలి

కందుకూరు, జూలై 24: రాష్ట్రంలో టీడీపీ కూటమి విజయం సాధించి రాష్ట్రాభివృద్ధి పరుగులు పెడుతున్న తరుణంలో మాజీ సీఎం జగన్మోహనరెడ్డి ఢిల్లీలో ధర్నా పేరుతో డ్రామాలకు తెరతీశాడని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రాభివృద్ధిని చూసి జగన్ తట్టుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా జగన్ నీచపు ఆలోచనలు మానుకుని రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

కలుగోళ శాంభవికి సారె సమర్పణ


సారె తీసుకువస్తున్న ఆర్యవైశ్య మహిళలు

కావలి, జూలై 24: గ్రామ దేవత కలుగోళ్ల శాంభవికి ఆషాడమాసం సందర్భంగా పట్టణంలోని ఆర్యవైశ్య మహిళలు బుధవారం సారె సమర్పించారు. శ్రీ భ్రమరాంబిక సేవా సమితి (చీరాల) సారధ్యంలో ప్రతి ఏటా అమ్మ వారికి సారె తీసుకురావడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉత్తరంపేట రామాలయం నుంచి మహిళలు సారెతో ప్రదర్శనగా వచ్చి తొలుత గంగమ్మ, పోలేరమ్మకు పూజలు చేశారు. అనంతరం కలుగోళ్ల శాంభవి ఆలయానికి చేరుకుని సారె సమర్పించారు. కార్యక్రమంలో ఓం నమఃశివాయ బృందం సభ్యులు అనుమలిశెట్టి కామాక్షి, సునీత, కిరణ్మయి, నేరెళ్ల సుధారాణి, దుగ్గిశెట్టి హేమలత, లక్ష్మీ, కల్లిపల్లి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ అమరవీరులకు నివాళి


నివాళులు అర్పిస్తున్న నందనవనం తదితరులు

కలిగిరి, జూలై 24: కార్గిల్ యుద్ధ వీరులకు వందనాలు సమర్పిస్తూ స్థానిక శివాలయం వద్ద జాతీయ అత్యుత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత నందనవనం ప్రభాకరరావు ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో కొవ్వత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నందనవనం మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో 527మంది సైనికులు వీరమరణం పొందడమే కాకుండా, 1374మంది క్షతగాత్రులయ్యారన్నారు. పాక్‌పై విజయానికి గుర్తుగా ప్రతిఏడాది కార్గిల్ విజయ్ దివస్‌గా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత బిజ్జం కృష్ణారెడ్డి, జిర్రా పెదఅంకిరెడ్డి, కొప్పోలు కొండలరావు, నాగిరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో పనిచేస్తే అద్భుత విజయాలు


ఆర్టీసీ గ్యారేజీలో స్టోర్ రూమును పరిశీలిస్తున్న ఆర్ఎం

కావలి, జూలై 24: ఇష్టంతో కష్టపడి పనిచేస్తే అద్భుత విజయాలు సాధించవచ్చని ఆర్టీసీ ఆర్ఎం జీ. విజయరత్నం తెలిపారు. బుధవారం ఆయన ఆర్టీసీ డిపోలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. మొదటిసారిగా ఆర్ఎం కావలికి రావటంతో పలు ఉద్యోగసంఘాల నాయకులు సత్కరించారు. అనంతరం జరిగిన ఉత్తమ ఉద్యోగుల అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. అత్యధికంగా ఇంధనపొదుపు సాధించిన డ్రైవర్లు బాలకోటయ్య, చెంచయ్యలను సత్కరించి నగదు అందచేశారు. కార్యక్రమంలో డీఎం రాపూరు శ్రీనివాసులు, ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఎం. రామకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్‌కే ఖాజామొహిద్దీన్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టిపై దృష్టి సారించాలి


సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో

కావలి రూరల్, జూలై 24: చెత్త నుంచి సంపద సృష్టించడంపై ప్రతీఒక్కరు దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మండలంలోని రుద్రకోట పంచాయతీని బుధవారం సందర్శించారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టాన్నారు. అనంతరం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. రానున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని గ్రామంలో మొక్కల పెంపకం చేపట్టాన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మహేశ్వరి, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు నివాళి


జాషువాకు టీడీపీ నేతల నివాళి

కందుకూరు : కవికోకిల గుర్రం జాషువా వర్ధంతిని బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ఎస్సీ సెల్ నాయకులు జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెబ్బవరపు మాల్యాద్రి, రాయపాటి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధు, బెజవాడ ప్రసాద్, ముచ్చు శ్రీను, బద్ధిపూడి శిఖామణి పాల్గొన్నారు.

● **కంపచెట్ల తొలగింపు**

కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని పలు శ్మశానవాటికల్లో బుధవారం కంపచెట్ల తొలగింపును మున్సిపల్ అధికారులు చేపట్టారు. శ్మశానవాటికల్లో దట్టంగా కంపచెట్లు పెరిగి మృతదేహాలను తీసుకెళ్లే అవకాశం లేకపోవడంతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. రెండురోజులుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

టీడీపీతోనే పేదల అభివృద్ధి

కొడవలూరు, జూలై 24: టీడీపీతోనే పేదల అభివృద్ధి సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు డేగా దయాకర్‌రెడ్డి అన్నారు. మండలంలో రామన్నపాళెం గ్రామంలో బుధవారం ప్రత్యేక గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఈ ప్రత్యేక గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవినీతి రహిత నియోజకవర్గ స్థాపనకు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సురేష్ , రియాజ్ , టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

విడవలూరు, జూలై 24: గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని టీడీపీ నాయకులు కుడుముల మల్లికార్జున్, రాజన్న, తుశూరు మాధవ్‌లు తెలిపారు. దండిగుంట, వరిణి పంచాయతీల్లో బుధవారం జరిగిన గ్రామ సభల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చాక పంచాయతీల అభివృద్ధికి శ్రీకారం చుట్టాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు బెల్లంకొండ సుప్రజ, రావెళ్ల మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

117 జీవో రద్దు చేయాలి : యూటీఎఫ్

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 24: ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసే 117 నెంబరు జీఓను రద్దు చేయడంతోపాటు ఇతర విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ బుచ్చి మండల శాఖ బుధవారం మండల విద్యాశాఖ అధికారి ఎం ధిలీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కేవీ. శ్రావణ్, యూటీఎఫ్ బుచ్చి మండలశాఖ నాయకులు గోపి, దొరసానమ్మ, రమణారెడ్డి, శీనయ్య, ఓబయ్య, శివకుమార్, రమేష్, నాగభూషణం పాల్గొన్నారు.

ఆంగ్ల ఉపాధ్యాయులకు శిక్షణ

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 24: తరగతి గదిలో పిల్లలకు సులభంగా ఆంగ్లం బోధించడానికి ఉపాధ్యాయులు సన్నద్ధం కావాలని ఎంఈఓ ధిలీప్‌కుమార్ అన్నారు. బుచ్చి డీఎల్ఎన్ఆర్ ప్రభుత్వఉన్నత పాఠశాలలో బుధవారం అంగ్ల ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణానంతరం పరీక్ష నిర్వహించి ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి రిసోర్సు పర్సన్స్‌గా చైతన్య చక్రవర్తి, వసంత్, సురేఖ, సుధీర్‌కుమార్, వ్యవహరించగా, బుచ్చి, అల్లూరు, విడవలూరు, ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఎంఈవో నియామకం



ఇన్‌చార్జి ఎంఈవో లీలాకుమార్

మనుబోలు, జూలై 24: ఎట్టకేలకు 24రోజుల తరువాత మండలానికి ఎంఈవోని నియమించారు. రాపూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయుడుగా ఉన్న లీలాకుమార్‌కు విద్యాశాఖ ఆర్‌జేడి ఉత్తర్వుల మేరకు పూర్తి అదనపు బాధ్యతలు ఇవ్వడంతో మనుబోలు ఎంఈవోగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతనెల 31న ఎంఈవో శేషాద్రివాసు పదవీవిరమణ తరువాత ఇన్‌చార్జి ఎంఈవోగా తోటపల్లి గూడూరు ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డిని వేశారు. ఆయన రాకపోవడంతో, నెల్లూరు రూరల్ ఎంఈవో తిరుపాల్‌ను వేయగా ఆయన మండలంలో బాధ్యతలు తీసుకోలేదు. దీంతో రాపూరు హెచ్‌ఎంను ఎంఈవోగా నియమించారు. ఎంఈవో రావడం పట్ల ఉపాధ్యాయులు, విద్యాశాఖ కార్యాలయం సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దును స్వాగతిస్తున్నాం

● ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



కోవూరు, జూలై 24 : భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన లాండ్ టైట్లింగ్ యాక్టు భూ యజమానులకు మెడకు ఉరితాడులాంటిదని చెప్పారు. అలాంటి నల్లచట్టాన్ని రద్దు చేసినందుకు కోవూరు నియోజకవర్గ ప్రజల తరఫున ధన్యవాదాలు చెబుతున్నట్లు తెలిపారు. అన్న క్యాంటీన్లలో భోజనం చేసే పేదవాళ్లను భిక్షగాళ్ళగా చేసి మాట్లాడారని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేసిన పెత్తందారీ దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజాతీర్పును గుర్తించి తీరు మార్చుకోవాలని వైసీపీ నాయకులకు హితవు పలికారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

వెంకటాచలం, జూలై 24: సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సహకారంతో రాజేంద్ర యువశక్తి పేరుతో వెంకటాచలంలో బుధవారం మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను తిరుపతి పార్లమెంట్ తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి యనమల రాజేంద్ర ప్రారంభించారు. తొలిమ్యాచ్‌లో గూడ్లూరువారిపాళెం జట్టు, రెండవ మ్యాచ్‌లో ఇస్కపాళెం జట్టు, మూడవ మ్యాచ్‌లో అనికేపల్లి జట్టు, 4వ మ్యాచ్‌లో కాకర్లవారిపాళెం జట్లు గెలుపొందాయి. క్రికెట్ టోర్నమెంట్‌లో 16 జట్లు తలపడుతుండగా విజేత జట్టుకు రూ.20 వేలు, రన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.10 వేలు నగదు బహుమతి, ట్రోఫీ, మెడల్స్ ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్ ఆర్గనైజర్లు రాజు, సుబ్బు, గోపి, టీడీపీ నేతలు అశోక్, హరి, వెంకటేష్, బాబురావు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

తోటపల్లిగూడూరు, జూలై 24: మండలంలోని పాపిరెడ్డిపాలెంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం టీడీపీ నేతల ఆధ్వర్యంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి అవసరమైన ప్లేట్లు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మేనాటి సీనయ్య, పరుచూరి హరిబాబు, దద్దోలు మనోహర్, కె సుధాకర్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కాపుల పట్టాభిషేకం

ముత్తుకూరు: స్థానిక ఆర్‌ఆర్ కాలనీ మధురానగర్ గ్రామ కాపుల పట్టాభిషేకం బుధవారం ఘనంగా జరిగింది. గ్రామ పెద్దకాపుగా బసంగారి ఈశ్వరయ్య, నడిపి కాపుగా వావిలి శివరామయ్య, చిన్నకాపుగా బుచ్చింగారి దొరబాబు, కోశాధికారులుగా పల్లెకారి మణి, ఆవుల తిరుపతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కాపులను మత్స్యకార నాయకులు శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం గ్రామ కాపుల పట్టాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించారు.

పంచాయతీలకు విముక్తి : మన్నెం

తోటపల్లిగూడూరు, జూలై 24: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీలకు నిధులు ఇచ్చి విముక్తి కలిగించిందని తిరుపతి పార్లమెంటు బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మన్నెం జితేంద్రగౌడ్ అన్నారు. తోటపల్లిగూడూరు సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి సునీల్, మన్నెం జితేంద్ర ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చిత్రపటాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మన్నెం కిరణ్ కుమార్, మాజీ ఎంపీటీసీ మన్నెం మధుసూదన్‌గౌడ్, మూగ రాజా, మన్నెం ప్రభాకర్, రావుల శ్రీహరి, ఇంగిలాల మురళి, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

మనుబోలు, జూలై 24: ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతిచెందిన మండలంలోని టీడీపీ నాయకుడు కాకాణి సురేంద్ర కుటుంబ సభ్యులను సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. అలాగే బద్దెవోలులో ఇటీవల చనిపోయిన డేవిడ్, ప్రసాద్‌ల కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొన్నూరు రామకృష్ణయ్య, మధునాయుడు, వెంకటరమణారెడ్డి, నిఖిల్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, మహేంద్ర, అల్లాభాషా, చిట్టిబాబు పాల్గొన్నారు.

దేశంలో రాష్ట్ర గౌరవాన్ని పెంచారు

పొదలకూరు, జూలై 24 : కేంద్ర బడ్జెట్లో భారీ కేటాయింపులతో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆంధ్రప్రదేశ్‌కు గుర్తింపు, గౌరవం కల్పించారని బీజేపీ సీనియర్ నాయకులు చింతగింజల సుబ్రహ్మణ్యం, రాచపూటి ధనుంజయరావు అన్నారు. బుధవారం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి సముచిత కేటాయింపులపై ఆనందం వ్యక్తం చేస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బల్లి పిచ్చయ్య, గొడవర్తి దినేష్, చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

పొదలకూరు, జూలై 24 : శిక్ష సప్తాహలో భాగంగా మూడవ రోజైన బుధవారం స్థానిక డీఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు కబడ్డీ, పరుగు పందెం, క్రికెట్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు సునీత, శివకుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సనత్‌కుమార్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఏవీ సుధాకర్, పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

మహిళా మార్టులో అక్రమాలపై విచారణ

నెల్లూరు(హరనాథపురం), జూలై 24: నగరంలోని జగనన్న మహిళా మార్టుకు సంబంధించి ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈనెల 9న ప్రచురితమైన మా డబ్బులు ఏం చేశారు? అనే కథనానికి జిల్లా సహకారశాఖాధికారి గురప్ప స్పందించారు. జగనన్న మహిళా మార్టు పరస్పర సహాయక సహకార సంఘాన్ని సందర్శించి, రికార్డులను పరిశీలించి ఆంధ్రజ్యోతిలో ప్రచురించబడిన అంశాలపై సమగ్ర విచారణ జరిపి, విచారణ నివేదకను అందచేయాలని జిల్లా సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. ఈ సందర్భగా ఆంధ్రజ్యోతితో డీసీవో మాట్లాడుతూ జగనన్న మహిళా మార్టు అంశాలపై విచారణకు ఆదేశించామని, విచారణ నివేదిక అందిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నల్లచట్టం రద్దు పట్ల హర్షం

నెల్లూరు(లీగల్), జూలై 24: ప్రజల మెడమీద కత్తిలా వేలాడుతుండిన ఏపీ. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్-2022ని రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ యాక్ట్‌ను రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటిస్తూ తీర్మానం చేయడాన్ని ప్రజలు స్వాగితస్తున్నారని తెలిపారు. అమరావతి రాజధానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.15వేల కోట్ల మంజూరు చేయడం కూటమి ప్రభుత్వం ఘనతేనని పేర్కొన్నారు.

కేంద్ర బడ్జెట్ మహిళా సాధికారతకు అనుకూలం



మాట్లాడుతున్న మహిళా మోర్చా నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 24: ఎన్డీఏ ప్రభుత్వం మహిళా సాధికారతను దృష్టిలో ఉంచుకొని 2024-25 బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కరణం సుభాషిణి పేర్కొన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అమరావతి రాజధాని అభివృద్ధికి రూ.15 వేల కోట్లు కేటాయించినందున అభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు. గ్రామీణ మహిళలకు ఉపాధి రంగం అభివృద్ధి సాధనలో డ్రోన్ దీదీ యోజన పథకం కింద డ్రోన్ పైలెట్లను మహిళలకే కేటాయించి నెలకు రూ.15 వేల ఆదాయం వచ్చేటట్లు ఏర్పాటు చేశారన్నారు. ప్రతి రంగంలో మహిళలకు పెద్దపీట వేశారన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకులు విజయ, సుజనా, లక్ష్మీప్రియ, మౌనిక, నాగలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవోగా ఐఏఎస్‌ను నియమించాలి

నెల్లూరు(హరనాథపురం), జూలై 24 : నెల్లూరు ఐటీడీఏ పీవోగా ఐఏఎస్ అధికారిని నియమించాలని కోరుతూ అమరావతిలోని గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి కన్నబాబుకు యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యానాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సాంఘీక సంక్షేమశాఖ మంత్రి డోలా వీరాంజనేయస్వామిని కలిశారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 24 : పద్మభూషణ్ గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా బుధవారం గుర్రం జాషువా గ్రంథాలయం వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్.ఖాసిం, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.కృష్ణయ్య ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు శ్రీ వెంకటేశ్వర కస్తూరిబా కళాక్షేత్రంలోని గుర్రం జాషువా విగ్రహానికి పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్, ఖాజామొహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొత్తగా బాధ్యతలు చేపట్టిన నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజను కలసి పూర్వ నగర పాలక కమిషనర్ వికాస్‌మర్మత్ హయాంలో నగరంలోని గుర్రం జాషువా గ్రంథాలయం పునఃనిర్మాణం పనులు ప్రారంభమయ్యాయని, ఎన్నికల కోడ్‌తో ఆగిన పనులు తిరిగి ప్రారంభించాలని వినతిపత్రం అందజేశారు. త్వరలో గ్రంథాలయాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకొంటానని కమిషనర్ సూర్యతేజ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జనార్దన్, ఖాజా మొహిద్దీన్, షేక్.ఖుద్దూస్ పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధికి ఉచితంగా మందులు

నెల్లూరు(వైద్యం), జూలై 24 : కుష్ఠువ్యాధి నివారణకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు అందిస్తామని కుష్ఠు నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. బుధవారం నెల్లూరు నగరంలోని పడారుపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇక్కడ వికలాంగుల కాలనీలో ఇంటింటికి తిరిగి కుష్ఠు వ్యాధి సర్వే తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్, కో ఆర్డినేటర్ వెంకటయ్య, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 24 : ది నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ సేవా కార్యక్రమంలో భాగంగా రెండు రోజులు (మంగళ, బుధవారాలు) మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో అసోసియేషన్ సభ్యులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొనగళ్ల శోభన్‌బాబు తెలిపారు. ప్రధాన కార్యదర్శి ఏవీ ఫణీంద్రకుమార్, కోశాధికారి బోగనాథం సుబ్రహ్మణ్యం, ప్రోగ్రామ్ చైర్మన్ జాలాది చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాల అందజేత

వెంకటాచలం, జూలై 24 : మండలంలోని కంటేపల్లి గ్రామంలో బుధవారం రైతులు, కౌలు రైతులకు పచ్చిరొట్ట, జీలుగు విత్తనాలను 50 శాతం రాయితీపై అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డీ హరి కరుణాకర్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకుడు అభిషేక్, రైతులు శ్రీహరి, ధనుంజయ తదితరులున్నారు.

డెంగ్యూ వ్యాధి నివారణపై అవగాహన

ఇందుకూరు పేట, జూలై 24: మండలంలోని నరసాపురం ఎంవీ ఆర్‌ఆర్ జడ్పీ హైస్కూల్ ప్లస్‌లో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా మైపాడు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నెల్లూరు సబ్ యూనిట్ అధికారి సుధాకర్‌రెడ్డి డెంగ్యూ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు ముజీర్, ఆశా కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ పార్లర్‌లో వృద్ధురాలికి టోకరా!

బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడ రోడ్డు సెంటర్ సమీపంలోని దొడ్ల డెయిరీ పార్లర్‌లో ఓ వృద్ధురాలికి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు టోకరా పెట్టారు. వారు అడిగిన మజ్జిగ ప్యాకెట్లు ఇచ్చేలోపు వృద్ధురాలిని మాటల్లో పెట్టి తాము పోలీసులమంటూ రూ.20వేలతో పలాయనం చిత్తగించారు. దీంతో బాధితురాలు సీతమ్మ లబోదిబోమంటూ కుటుంబ సభ్యులకు చెప్పింది. వారు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెబుతున్నా తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సమగ్ర ఎరువుల యాజమాన్యంపై శిక్షణ

పొదలకూరు, జూలై 24 : మండలంలోని డేగపూడి గ్రామంలో రైతులకు ఆత్మవారి సౌజన్యంతో సమగ్ర ఎరువుల యాజమాన్యంపై శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహంచారు. జిల్లా వనరుల కేంద్రం, వ్యవసాయాధికారి యు గీతాకుమారి మాట్లాడుతూ రైతులు పంటలు లేని సమయంలో తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త (సేద్య విభాగం) డాక్టర్ కె కిరణ్‌కుమార్‌రెడ్డి, ఐఎఫ్ఎఫ్‌సీఓ జిల్లా సేల్స్ మేనేజర్ వి లక్ష్మీ నారాయణతదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఎస్ఏ ఏపీసీ

నెల్లూరు(విద్య), జూలై 24 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తే మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతు oదని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సీహెచ్.ఉషారాణి తెలిపారు. నగరంలోని గాంధీ నగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వారం రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఆమె పోటీలను ప్రారంభించి విద్యార్థులను ఉత్సాహ పరిచారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో మమత, సీఎంవో పెంచలయ్య, ఎంఈవో మురళీధర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో బుధవారం శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఖోఖో, క్రికెట్, స్కిప్పింగ్, పరుగు పందెంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.భాస్కర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ

నెల్లూరు(హరనాథపురం), జూలై 24 : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాలను ఈ నెలంతా ఘనంగా నిర్వహిస్తున్నామని ఎంఎస్పీ జాతీయ నాయకుడు గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనకై 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో అసువులు బాసిన అమర వీరులను స్మరించుకుంటూ వారి ఆశయ సాధన కోసం అలుపెరగని పోరాటం కొనసాగించాలని, జిల్లాలో ప్రతి మాదిగ పల్లెల్లో ఎమ్మార్పీఎస్ జెండా ఎగరాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ మాదిగ, రాష్ట్ర నాయకులు మంద పెంచలయ్యమాదిగ, గోచిపాతల వెంకటేశర్లు మాదిగ, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొప్పర్తి కొండయ్య, ఎంఎల్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులు గడ్కరీ, గోయల్‌తో వేమిరెడ్డి భేటీ

● జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధిపై చర్చ



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని సత్కరిస్తున్న ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), జూలై 24 : నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఢిల్లీలో కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలో జాతీయ రహదారుల అభివృద్ధికి సంబంధించిన అంశాలను గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. జాతీయ రహదా రుల పెండింగ్ పనులు, నిర్మించాల్సిన ఫ్లైఓవర్లు, జాతీయ రహదారుల విస్తరణకు సంబంధించిన అంశాలను చర్చించారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆదేవి ధంగా బియ్యం ఎగుమతులపై నిషేధం ఎత్తివేయాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కోరారు.

డిగ్రీ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

నెల్లూరు(విద్య), జూలై 24 : విక్రమ సింహపురి విశ్వ విద్యాలయం విడుదల చేసిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ ఫలితాల్లో కృష్ణచైతన్య కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సొంతం చేసుకున్నారని కళాశాల డైరెక్టర్‌లు డాక్టర్ ఆర్‌వీ.కృష్ణారెడ్డి, పి.రాజా ప్రమోద్‌రెడ్డిలు తెలిపారు. బుధవారం నగరంలోని కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడారు. తమ కళాశాలకు చెందిన విద్యార్థులు అన్ని విభాగాల్లోనూ సత్తా చాటారన్నారు. అందరి సమష్టి కృషితోనే ఈ విజయాలు సొంతం అవుతున్నాయని, ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామని తెలిపారు. అనంతరం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ బి.సుధారాణి, అడ్మిన్ డీన్ సి.రామాంజనేయులు, ప్రిన్సిపాల్ నాగయ్య, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

నెల్లూరు(విద్య), జూలై 24 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రామచంద్ర మిషన్ సంస్థ సెంట్రల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.వెంకటకృష్ణ తెలిపారు. నగరంలోని పొదలకూరురోడ్డు గౌతమినగర్‌లోని రామచంద్రమిషన్‌లో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ తలపెట్టిన ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మపేరు మీద ప్రతి ఒక్కరూ ఒక మొక్కనాటుదాం) కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని తాము కూడా హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ గురువు పార్థసారధి రాజగోపాలాచారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరులో మొక్కలు నాటామన్నారు. అనంతరం ఉచిత ఆయుర్వే వైద్యశిబిరం, ధ్యానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ జిల్లా మెడికల్ ఆఫీసర్ గోవింద్, రోడ్డు భవనాల శాఖ సూపరింటెండెంట్ గంగాధర్, రామచంద్రమిషన్ సభ్యులు, యోగా మిత్రమండలి సభ్యులు, ఆయుర్వేద డాక్టర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 'అమ్మ పేరుతో ఓ మొక్క'



మొక్కలు పంపిణీ చేస్తున్న అధికారులు

నెల్లూరు(విద్య), జూలై 24 : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ స్ఫూర్తితో ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ పేరుతో ఒక్క మొక్క కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసూరి తెలిపారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నెల్లూరు క్షేత్ర కార్యాలయం ఆధ్వర్యంలో నగరంలో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నాటే మొక్కలకు వారధి ఫౌండేషన్ పర్యవేక్షిస్తుందని తెలిపారు. రంగనాయకులపేట పీఎంఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, నవాబుపేట ఎంసీహెచ్ ప్రత్తివారి పాఠశాల, పప్పులవీధిలోని వైవీఎం నగరపాలక ఉన్నత పాఠశాలలో వన మహోత్సవాన్ని నిర్వహించి సామాజిక వనవిభాగం సహకారంతో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వారధి ఫౌండేషన్ చైర్మన్ రంగనాథ్, కార్యదర్శి ఆర్కాట్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 24: నగరంలోని మహాత్మా గాంధీనగర్ కృష్ణమందిరంలో బుధవారం సాయంత్రం గణపతి స్వామికి సంకటహరణ పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. పంచామృతాభిషేకాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, అనంతరం అలంకరణ, విశేష పూజలు జరిగాయి. భక్తులకు తీర్థ ప్రసాద వితరణలు జరిగాయి.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424

వెయ్యేళ్ల నాటి పద్ధతిలో....

- ముక్కంటి ఆలయ పైకప్పు బీటలకు మరమ్మతు పనులు
- రూ.5కోట్ల అంచనాతో ప్రారంభం
- ఖర్చు భరిస్తున్న పూణె భక్తుడు



ఆలయం పైకప్పుపై పనులు

శ్రీకాళహస్తి, జూలై 24: శ్రీకాళహస్తీశ్వరాలయ పైకప్పు బీటల మరమ్మతు పనులు పురాతన నిర్మాణశైలిలో సాగుతున్నాయి. ఐఐటీ నిపుణుల పర్యవేక్షణలో ప్రాచీన పద్ధతుల్లో సహజ పదార్థాలతోనే ఈ పనులు జరుగుతున్నాయి. పూణెకి చెందిన భక్తులు దాదాపు రూ. అయిదు కోట్ల వ్యయంతో ఈ పనులు చేయిస్తున్నారు. కొన్నేళ్ల కిందట ముక్కంటి ఆలయం పైకప్పుకు పగుళ్లువారి వాన కురిస్తే నీరు కారేది. స్వామి అమ్మవార్ల గర్భాలయ సన్నిధిలో వర్షపునీరు కారేది. ఆలయ అధికారులను, భక్తులను ఈ పరిణామం కలవరపరిచింది. పురాతన ఆలయానికి మరమ్మతు పనులు ఆధునిక పద్ధతిలో చేపడితే ప్రాచీనతకు భంగం వాటిల్లుతుంది. ఈ సమయంలో మసూరులోని కేంద్ర ఆర్కియాలజీ శాఖలో ఎపిగ్రఫీ విభాగ జాతీయ డైరెక్టర్‌గా ఉన్న తిరుపతి వాసి మునిరత్నంరెడ్డి చొరవ తీసుకున్నారు. భారతీయ ప్రాచీన నిర్మాణ పద్ధతులు అనుసరించి మరమ్మతులకు పూనుకోవాలని సూచించారు. పూణెకు చెందిన వ్యాపారి వెంకటేశ్వరరావు అనే భక్తుడిని ఆయన సంప్రదించారు. ఉత్తరాదేవి చారిటబుల్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు సాగిస్తున్న ఆయన ఈ మరమ్మతు పనులకయ్యే ఖర్చు భరించేందుకు ముందుకొచ్చారు. ఏడాది పాటు ఐఐటీ నిపుణులతో అధ్యయనం చేయించారు. వెయ్యేళ్ల క్రితం నాటి పురాతన విధానంతో శాస్త్రీయంగా పనులు చేపట్టాలని నిర్ణయించి బుధవారం పనులు ప్రారంభించారు.



అరబియన్ వృక్షాల బంక



నానబెట్టిన సున్నం



నానబెట్టిన బెల్లం, కరక్కాయ పొడి

ఎలా చేస్తారంటే..

సిమెంటు, ఆధునిక రసాయన లీకేజీ ప్రూఫ్‌లు మరమ్మతు పనుల్లో వాడకూడదని నిర్ణయించుకున్నారు. వెయ్యేళ్ల క్రితం నిర్మాణాలు జరిగిన పద్ధతిలోనే ఒక మిశ్రమం తయారు చేసుకుంటున్నారు. సున్నం, బెల్లం, కరక్కాయ పొడి, కాల్చిన మట్టి, ఇటుక ముక్కలు, ఇటుకల పొడితో పాటూ అరబ్బు దేశాల నుంచి దిగుమతి చేసుకున్న బంక (ఆ ప్రాంతపు చెట్ల నుంచి సేకరించేది) వాడుతున్నారు.వేర్వేరు డ్రమ్ముల్లో వీటిని నానబెట్టుకున్నాక సమపాళ్లలో ఇసుకతో కలిపి ఒక మిశ్రమం సిద్ధం చేసుకుంటున్నారు. పూణె నుంచి వచ్చిన నిపుణులైన కార్మికులు ఆలయం పైకప్పుపై ఈ పనులను చేస్తున్నారు. పనులు పూర్తయ్యేందుకు నెలరోజులు పడుతుందని అంచనా. ఆలయ అధికారులు వీరికి సహకరిస్తున్నారు.

గేట్లు తెరిచి దారివ్వండి



పెద్దిరెడ్డి ఇంటి సమీపంలో బుధవారం కూడా మూసివున్న గేట్లు

- హైకోర్టు ఆదేశం
- అయినా లెక్కచేయని పెద్దిరెడ్డి

తిరుపతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో మారుతీనగర్, రాయల్‌నగర్ మెయిన్‌రోడ్లను కలుపుతూ నిర్మించిన సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన గేట్లను మూసివేయవద్దని, సామాన్య ప్రజల రాకపోకలకు అవరోధం కల్పించవద్దని మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులను హైకోర్టు ఆదేశించింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ వేసిన రోడ్లకు పెద్దిరెడ్డి తన ఇంటి ముందు సామాన్య ప్రజలు ఎవరూ రాకపోకలు సాగించకూడదని రెండు వైపులా గేట్లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.ఈ గేట్లను ఓపెన్ చేసి రెండు కాలనీలకు రాకపోకలు కల్పించాలని హైకోర్టు ఆదేశించినా ఇప్పటికీ గేట్లు తెరవకపోవడం విమర్శలకు తావిస్తోంది.దీని పూర్వాపరాలు పరిశీలిస్తే...కార్పొరేషన్ రోడ్డుకు పెద్దిరెడ్డి గేట్లు ఏర్పాటుచేసుకోవడంపై మీడియాలో కథనాలు రావడంతో మూడు వారాల క్రితం పెద్దిరెడ్డి ఇంటిముందు జనసేన నేత కిరణ్ రాయల్ ధర్నాకు దిగిన నేపథ్యంలో వివాదం రోడ్డెక్కింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మున్సిపల్ అధికారులను నివేదిక కోరారు. స్థానిక 18వ డివిజన్లోని మారుతీనగర్-రాయల్ నగర్‌ను కలిపేందుకు సీసీ రోడ్డు వేస్తున్నట్టు రూ9.55లక్షల అంచనాతో (ఐఎఫ్‌బి నెం45/19-20)ఒకటి, రూ9.50 లక్షలతో (ఐఎఫ్‌బి నెం.46/19-20)లతో మరొకటి రెండు విడతలుగా నామినేటెడ్ కింద టెండరిచ్చినట్టు అధికారులు గుర్తించారు.స్థానికుల విజ్ఞప్తి మేరకు రాయల్ నగర్ నుంచి మారుతీనగర్‌ను కలుపుతూ రోడ్డు వేస్తున్నట్టు కార్పొరేషన్ రికార్డులో నమోదు చేసిన విషయాన్ని కూడా నిర్ధారించారు.అయితే ఈలోపు పెద్దిరెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఈనెల 8న హైకోర్టును ఆశ్రయించారు.సంబంధిత స్థలంలో నిర్మించిన సిమెంట్ రోడ్డును, రక్షణ కోసం నిర్మించిన గేటును తొలగించకుండా ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. తమ భద్రతను దృష్టిలో పెట్టుకుని అప్పట్లో కార్పొరేషన్ నిధులతో సీసీ రోడ్డు నిర్మించారని, అందుకైన ఖర్చుకూడా తాము చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని అభ్యర్థించారు. కార్పొరేషన్ తరపున కూడా ఓ నివేదికను కోర్టుకు సమర్పించారు.ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్..పిటీషనర్ల ఆస్తుల విషయంలో ఏవైనా చర్యలు తీసుకోవాలని భావిస్తే చట్ట నిబంధనల ప్రకారం నడుచుకోవాలని అధికారులకు మధ్యంతర ఉత్తర్వులు ఇస్తూ ఈనెల 10వ తేదీకి కేసును వాయిదా వేశారు.ఇంతవరకు పెద్దిరెడ్డికి అనుకూలమైన తీర్పువచ్చినప్పటికీ 10వ తేదీ ప్రభుత్వ న్యాయవాది రిట్ పిటీషన్ దాఖలు చేశారు.ప్రజా రవాణాకు ఇబ్బంది కలగకుండా,గేట్లు మూసివేయకుండా చూడాలని 8వ తేదీ ఇచ్చిన ఉత్తర్వును సవరిస్తూ హైకోర్టు స్పష్టంగా మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ప్రతివాదులకు కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేయడానికి కేసును 4 వారాలకు వాయిదా వేసింది. పిటీషనర్ల ఆస్తికి ఏదైనా ముప్పు ఉన్నట్లైతే, అవసరమైన రక్షణ కోసం సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది.చట్టనిబంధనలను అనుసరించి దరఖాస్తుపై నిర్ణయం తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేసింది. పిటిషనర్ల ప్రైవేటు ఆస్తి వ్యవహారంలో ఎలాంటి తొందరపాటు, బలవంతపు చర్యలు తీసుకోవద్దని కార్పొరేషన్ అధికారులను ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవరించింది.ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాల మేరకు తదుపరి తీర్పు వచ్చేవరకు పెద్దిరెడ్డి ఇంటి ముందు రెండు కాలనీలకు దారి కల్పించాలని ఈనెల 15న మున్సిపల్ కార్పొరేషన్‌కు ఉత్తర్వులు అందాయి.అయితే ఇప్పటికీ ఆయన గేట్లు తెరిచివుంచకపోవడంతో కార్పొరేషన్ యంత్రాంగం అటువైపు వెళ్లేందుకు కూడా సాహసించకపోవడం విమర్శలకు తావిచ్చింది. బుధవారం బాధ్యతలు తీసుకున్న కొత్త కమిషనర్ అయినా ఆ దిశగా చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి.

అమృత్ భారత్‌కు పది రైల్వే స్టేషన్ల ఎంపిక



తిరుపతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఏకంగా పది రైల్వే స్టేషన్లకు తీపి కబురు ప్రకటించింది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఈ రెండు జిల్లాల పరిధిలో మొత్తం పది రైల్వే స్టేషన్లను ఎంపిక చేసింది. తిరుపతి, రేణిగుంట, పాకాల , చిత్తూరు, శ్రీకాళహస్తి, మదనపల్లె రోడ్డు, పీలేరు, కుప్పం,గూడూరు, సూళ్ళూరుపేట స్టేషన్లు అవకాశం దక్కించుకున్నాయి. కాగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 73 రైల్వే స్టేషన్లను కేంద్రం ఎంపిక చేయగా అందులో ఈ ప్రాంతానివే పది స్టేషన్లు వుండడం గమనార్హం. అమృత్ భారత్ పథకం కింద ఇపుడున్న రైల్వే స్టేషన్లను పూర్తి స్థాయిలో తిరిగి అభివృద్ధి పరచనున్నారు. అత్యాధునిక సాంకేతిక సదుపాయాలు, హంగులతో వీటిని తీర్చిదిద్దే అవకాశముంది. అయితే స్టేషన్ల వారీ అభివృద్ధికి కేటాయించిన నిధుల వివరాలు ఇంకా వెల్లడి కాలేదు. కొన్నేళ్ళ కిందటే ఈ ప్రాంతంలోని రైల్వే స్టేషన్లను ఆధునికీకరించిన సంగతి తెలిసిందే. తాజాగా కేంద్రం అమృత్ పథకం కిందకు వీటిని చేర్చడంతో ఆధునికీకరణ, అభివృద్ధి పరంగా ఈ స్టేషన్లు మరో అడుగు ముందుకు వేయనున్నాయి. ఎంపికైన స్టేషన్లను పరిశీలిస్తే తిరుపతి, శ్రీకాళహస్తి స్టేషన్లు పుణ్యక్షేత్రాల కేటగిరీలో వుండగా గూడూరు, రేణిగుంట, పాకాల స్టేషన్లు జంక్షన్ కేంద్రాలుగా వున్నాయి. సూళ్ళూరుపేట తమిళనాడు సరిహద్దుల్లోనూ, కుప్పం కర్ణాటక సరిహద్దుల్లోనూ కీలక స్టేషన్లు. చిత్తూరు జిల్లా కేంద్రంతో పాటు తమిళనాడు సరిహద్దుల్లో కీలక స్టేషన్ కాగా పీలేరు ఉమ్మడి చిత్తూరు జిల్లా నడిబొడ్డున ముఖ్యమైన స్టేషన్‌గా ఆవిర్భవించిన సంగతి తెలిసిందే. వీటి ప్రాధాన్యతను బట్టే అమృత్ పథకం పరిధిలోకి వీటిని కేంద్ర ప్రభుత్వం చేర్చినట్టు భావించాల్సి వస్తోంది. ఈ స్టేషన్ల దశ సమీప భవిష్యత్తులో సమూలంగా మారనుంది.



కలెక్టర్ వెంకటేశ్వర్‌తో జేసీ శుభం బన్సల్

జేసీ బాధ్యతల స్వీకారం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 24: తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా శుభం బన్సల్ బుధవారం కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారి పాదాల చెంత జేసీగా రెండవ సారి పని చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలను సమర్థవంతంగా అమలు చేయడానికి కృషి చేస్తామన్నారు. జేసీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శుభం బన్సల్ కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.కాగా శుభం బన్సల్‌ను డీఆర్వో పెంచలకిషోర్, కలెక్టరేట్ ఏవో జయరాములు, పలువురు జిల్లా అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



మేయర్ శిరీషతో కమిషనర్ మౌర్య

తాగునీటి సమస్య పరిష్కారానికే

తొలి ప్రాధాన్యం

- కమిషనర్ మౌర్య

తిరుపతి, జూలై24(ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, స్మార్ట్ సిటీ ఎండీగా నారపు రెడ్డి మౌర్య బుధవారం ఉదయం నగరపాలక సంస్థ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ కౌన్సిల్ సహకారంతో అధికారులను, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ తిరుపతి నగరాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రజా సమస్యలపై వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం అన్ని విభాగాల అధిపతులతో సమావేశమయ్యారు.తిరుపతి నగరాభివృద్ధికి కలిసికట్టుగా సమన్వయంతో పని చేద్దామని సూచించారు.కమిషనర్ మౌర్యకు అధికారులు, పలువురు కార్పొరేటర్లు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సమావేశంలో ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, డీసీ అమరయ్య, ఎస్ఈ మోహన్, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, కె.ఎల్.వర్మ, సెక్రటరీ రాధిక, మేనేజర్ చిట్టిబాబు, అడిషనల్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర రెడ్డి, మెప్మా కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మేయర్ డాక్టర్ శిరీషను కమిషనర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఐదేళ్ల భూబాగోతం సిద్ధం

భూవివరాలు అందించేందుకు జేసీ ఛాంబర్ వద్ద వేచివున్న తహసీల్దార్లు



- నిషేధిత, ఫ్రి హోల్డ్, ఇనామ్, ఎస్టేట్ భూముల వివరాల సేకరణ
- నేడు మదనపల్లెలో ఉమ్మడి జిల్లా అధికారుల సమావేశం

చిత్తూరు, ఆంధ్రజ్యోతి/ చిత్తూరు కలెక్టరేట్, జూలై 24: మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి నిప్పు ప్రభావం మన జిల్లా మీదా పడింది. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాలు ఉన్న విషయం తెలిసిందే. దీంతో మదనపల్లె ఘటనలో విచారణ బాధ్యతను చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కూ కొంత మేర అప్పగించారు. ఇక ఉమ్మడి జిల్లాలో భూముల వివరాలపై రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా గురువారం మదనపల్లెలో ఉమ్మడి జిల్లా పరిధిలోని తహసీల్దారు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు, ఆర్డీవోలతో సిసోడియా సమావేశం ఏర్పాటు చేశారు. దీనికోసం వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన భూబాగోతాలను కలెక్టర్ ఆధ్వర్యంలో వివరాలు సేకరించారు. వీటిని ప్రభుత్వం పంపిన ప్రొఫార్మాలో నింపి బుధవారం జేసీ శ్రీనివాసులుకు అందించారు. మండలాలవారీగా ఐదేళ్లలో 22(ఏ) నిషేధిత జాబితా నుంచి ఎంత భూమిని తొలగించారు.. ఎంత మేర డీకేటీ భూమిని ఫ్రి హోల్డ్ కిందికి మార్చారు.. అలాగే ఈనామ్, ఎస్టేట్, సెటిల్‌మెంట్, ఎండోమెంట్ ల్యాండ్స్ విషయంలో ఏం జరిగింది.. ఎంత మేర ల్యాండ్ కన్వర్షన్ చేశారు.. వంటి సమగ్ర వివరాలను మంగళ, బుధవారాలు తయారు చేశారు. ఈ వివరాలతో గురువారం నాటి సమావేశానికి హాజరుకానున్నారు.

- అలాగే, గత ఐదేళ్లలో అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్ పైనా ఈ సమావేశంలో సిసోడియా సమీక్షించనున్నారు. దీనికోసం గ్రామాలవారీగా రిజిస్ట్రేషన్ల వివరాలను ఈ రెండు రోజులపాటు జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు సేకరించారు. మదనపల్లెలో జరిగే ఈ సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్‌తో పాటు 13మంది సబ్‌రిజిస్ట్రార్లు పాల్గొననున్నారు.

పాలిటెక్నిక్ సీట్లకు 31నుంచి స్పాట్ అడ్మిషన్లు

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్‌లలో మిగిలిపోయిన సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్టు సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ గుమ్మల గణేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న ఖాళీ సీట్ల జాబితాను ప్రదర్శిస్తారని, 31 నుంచి అడ్మిషన్ల భర్తీ ప్రక్రియ ప్రారంభమవుతుందని వివరించారు.

కార్యకర్తల కష్టాన్ని ఏనాడూ మరచిపోము

- టీడీపీ శ్రేణుల సమావేశంలో నారా భువనేశ్వరి

కుప్పం, జూలై 24: 'కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి సీఎం చంద్రబాబు రూ.250 కోట్ల గ్రాంటు ఇవ్వనున్నారు. ఈ నిధులతో పట్టణం సమగ్రాభివృద్ధి చెందుతుంది' అని సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. కుప్పంలోని పీఈఎస్ ఆడిటోరియంలో బుధవారం ఉదయం టీడీపీ నేతలు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లతో ఆమె సమావేశమయ్యారు. కార్యకర్తల కష్టాన్ని చంద్రబాబు కానీ, తాను, లోకేశ్ కానీ ఏనాడూ మరచిపోలేదన్నారు. వైసీపీ అయిదేళ్ల పాలనలో కార్యకర్తలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, పార్టీకోసం తమ జీవితాలను త్యాగం చేశారని చెప్పారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పెద్దిరెడ్డి సృష్టించిన అరాచకాలకు, అన్యాయాలకు కార్యకర్తలు భయపడిపోయారని క్లస్టర్ ఇన్‌చార్జి పీజీ ప్రతాప్ చెప్పారు.అయితే ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఇచ్చిన ధైర్యంతో తేరుకుని, బూత్‌లవద్ద ధైర్యంగా నిలబడి చంద్రబాబుకు విజయం సాధించిపెట్టామని చెప్పారు.



కార్యకర్తల మాటలు ఆలకిస్తున్న భువనేశ్వరి

ఉపాధి కూలీలకు అందని బకాయిలు

ఓజిలి, జూలై 24: మండలంలోని ఉపాధి కూలీలకు కోటి 25 లక్షల రూపాయల చెల్లింపులు నిలిచిపోయాయి. మండలంలోని ఉపాధి కూలీలకు 82,500 పని దినాలకు సంబంధించి గత 10 వారాలుగా చెల్లింపులు జరగలేదు. దీంతో ఉపాధి కూలీలు తమ వేతనం కోసం రోజు పోస్టాఫీసు, ఇతర ఏజెన్సీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మండలంలో 26 పంచాయతీల పరిధిలో 626 శ్రమ శక్తి సంఘాలు ఉండగా వాటిలో 16,226 మందికి జాబ్ కార్డులు ఉన్నాయి. కాగా గతంలో కూడా ఉపాధి కూలీలకు సక్రమంగా కూలీలు అందకపోవడంతో కొందరు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణకు స్థానికంగా ఉపాధి కల్పిస్తూ ఈ పథకం ద్వారా కూలీలు అందిస్తున్న నేపథ్యంలో వారాల తరబడి కూలీలకు వేతనాలు చెల్లించక పోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా బకాయిలు చెల్లించాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు. దీనిపై ఏపీవో ఉషారాణి మాట్లాడుతూ... రూ.1.25 కోట్ల బకాయిలు ఉన్న మాట వాస్తవమన్నారు. కొన్ని పంచాయతీల్లో కొంతమేర చెల్లింపులు జరిగాయన్నారు. తొమ్మిది వారాలుగా చెల్లింపులు జరగలేదన్నారు. ఓజిలితో పాటూ కొన్ని మండలాల్లో చెల్లింపులు జరగలేదన్నారు.

గంజాయి అరికట్టేందుకు చర్యలు తీసుకోండి

హోం మంత్రికి పాశిం వినతి



హోం మంత్రి అనితకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, జూలై 24: గూడూరు నియోజకవర్గంలో గంజాయి, మత్తుపదార్థాల అక్రమ రవాణాన్ని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ హోంమంత్రి అనితను కోరారు. బుధవారం అమరావతిలోని సచివాయలంలో హోంమంత్రి అనితను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గూడూరు నియోజకవర్గంలో గంజాయి అక్రమ రవాణ జరగకుండా, రౌడీయిజాన్ని ఆరికట్టేలా చర్యలు తీసుకుని శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరామన్నారు. నియోజకవర్గ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణం నెలకొల్పేలా పోలీసు అధికారులకు సూచనలు జారీ చేయాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కిషోర్‌నాయుడు, మోహన్‌రెడ్డి, శివకుమార్ తదితరులు ఉన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, జూలై 24: వర్షాకాలం సమీపిస్తుండడంతో పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ బాధ్యతలు చేపట్టగానే పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చేపట్టారన్నారు. పారిశుధ్యాన్ని మెరుగుపరిచి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవడంతోపాటు శివారుప్రాంతాల్లోని వీధిదీపాలు వెలిగేలా చూడాలని కోరారు. మురుగు నీటి కాలువల్లో చెత్తాచెదారాన్ని తొలగించాలన్నారు. బి.చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్‌కుమార్, చంద్రమౌళి, రమేష్‌కుమార్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు గుర్రం జాషువా



జాషువాకు నివాళి అర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు

గూడూరు అర్బన్, జూలై 24: గుర్రం జాషువా ఆదర్శ ప్రాయుడని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాల సుబ్రమణ్యం అన్నారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో గుర్రం జాషువా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ... సామాజిక రుగ్మతులను, అసమానతలను రూపు మాపేందుకు గుర్రంజాషువా తన రచనలతో కృషి చేశారన్నారు. తన రచనల ద్వారా సమాజంలో చైతన్యాన్ని నింపారన్నారు. ప్రసాద్, శివకుమార్, యాదగిరి, శ్రీనివాసులు, సురేష్, శంకరయ్య, బీవీరమణయ్య, మణి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించండి

గూడూరు అర్బన్, జూలై 24: మండలంలోని గొల్లపల్లి పంచాయతీలోని డంపింగ్‌యార్డ్‌ను గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకున్నారని అధికారులు ఆక్రమణలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని బుధవారం గొల్లపల్లి పంచాయతీవాసులు పేర్కొన్నారు. గొల్లపల్లి పంచాయతీ పరిధిలో డంపింగ్‌యార్డ్ స్థలాన్ని గ్రామంలోని కొందరు ఆక్రమించుకున్నారని అధికారులు విచారణ జరిపి ఆక్రమణలను తొలగించాలని కోరుతున్నామని తెలిపారు.

మరుగుదొడ్లు లేని ఇళ్లను గుర్తించండి

డక్కిలి, జూలై 24: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సిబ్బంది మరుగుదొడ్ల లేని ఇళ్లను గుర్తించాలని ఈవోపీఆర్డీ అల్లాబక్షు ఆదేశించారు. బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతి కుటుంబానికీ మరుగుదొడ్డి ఉండాల్సిందేనన్నారు.. మరుగుదొడ్డి లేని ఇళ్లను గుర్తిస్తే ప్రభుత్వం వారందరికీ మరుగుదొడ్లు మంజూరు చేస్తుందన్నారు. గామాల్లో పారిశుధ్యం పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని సూచించారు.

బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు వెనక్కి

డక్కిలి, జూలై 24: ఎన్నికల విధుల్లో భాగంగా వచ్చిన తహసిల్దార్లను రెండు రోజుల క్రితం వారు పని చేస్తున్న ప్రాంతాలకు ప్రభుత్వం బదిలీ చేసిన విషయం విదితమే. అయితే తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు రిలీవ్ కావద్దంటూ వారికి మంగళవారం కొత్తగా ఆర్డర్లు జారీ అయ్యాయి. దీంతో మంగళవారం రిలీవ్ అయిన డక్కిలి తహసీల్దార్ శ్రీనివాసులు మళ్లీ విధుల్లో చేరాలని గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ ఆదేశించడంతో ఆయన డక్కిలికి తిరిగి రానున్నారు.

శిథిలావస్థలో తుఫాన్ షెల్టర్లు



చీమలపాడులో, శ్యామసుందరపురంలో, అద్దేపల్లిలో శిథిలావస్థలో ఉన్న తుఫాన్‌షెల్టర్లు

గూడూరు, జూలై 24: తుఫాన్లు సంభవించిన సమయంలో తీరప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు నిర్మించిన షెల్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. తుఫాన్ కారణంగా లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల వివాస గృహాల్లోకి నీరు చేరిన సమయంలో వారికి ఆవాసం కల్పించేందుకు షెల్టర్లును నిర్మించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో షెల్టర్ల అభివృద్ధికి చర్యలు చేపట్ట లేదని తీరప్రాంతవాసులు చెబుతున్నారు. దీంతో తుఫాన్లు సంభవించిన సమయంలో సమీప పాఠశాలల్లోనో, ప్రభుత్వ కార్యాలయాల్లోనో తాత్కాలిక ఏర్పాటు చేస్తున్నట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గూడూరు నియోజకవర్గ పరిధిలో చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో తీరప్రాంత గ్రామాలున్నాయి. ఈ మండలాల్లో తుఫాన్ల సందర్భంగా భారీ వర్షాలు కురిసినప్పుడు లోతట్టు ప్రాంతాలు జలమయమైతే అక్కడి ప్రజలను తుఫాన్ షెల్టర్లకు తరలిస్తుంటారు. గత కొన్నేళ్లుగా వీటి అలనా, పాలనా పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి.

చిల్లకూరు మండలంలో మోమిడి, వరగలి, తమ్మినపట్నం, కోమరావారిపాళెం, పోసివారిపాళెం, రావులవారిపాళెం, మన్నెగుంట, అద్దెపల్లి, తూర్పుకనుపూరు, వేళ్లపాళెం గ్రామాల్లో తుఫాన్‌షెల్టర్లు ఉండగా తూర్పు కనుపూరు, మోమిడి, తమ్మినపట్నం మినహా మిగిలినవి శిథిలావస్థలో ఉన్నాయి. కోట మండలంలోని కొత్తపట్నం, శ్రీనివాసస్రతం, గోవిందుపల్లిపాళెం, సిద్దవరం, దైవాలదిబ్బ, కర్లపూడి, శ్యామసుందరపురంలల్లో తుఫాన్ షెల్టర్లు ఉన్నాయి. వీటిలో కొత్తపట్నం, శ్రీనివాసస్రతం, సిద్దవరంల్లోని షెల్టర్లు నిరుపయోగంగా ఉండగా మిలిగినవి శిథిలావస్థకు చేరుకున్నాయి. వాకాడు మండలం మొనపాళెం, నవాబుపేట, కొండూరుపాళెం, అందలమాల, వాళమేడు, చీమలపాడు, దుగరాజపట్నం గ్రామాల్లో తుఫాన్‌షెల్టర్లు ఉన్నాయి. వీటిలో మొనపాళెం, కొండూరుపాళెం గ్రామాల్లో మినహా మిగిలినవ్వి శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా ఉన్నాయి. చిట్టమూరు మండలంలోని పిట్టివానిపల్లి, బుదరగాలి, పల్లంపర్తి గ్రామాల్లో తుఫాన్‌షెల్టర్లు ఉండగా పిట్టివానిపల్లిలోని షెల్టర్ మినహా మిగిలినవి శిథిలావస్థకు చేరుకున్నాయి. నియోజకవర్గ పరిధిలోని తీరప్రాంత గ్రామాల్లో ప్రజలకు వరదల సమయంలో ఇబ్బందులు కలగకుండా శిథిలావస్థకు చేరిన తుఫాన్‌షెల్టర్లకు సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది.

దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు నేషనల్ స్పేస్ డే సంబరాలు

షార్ డైరెక్టర్ చేతుల మీదుగా గుంటూరులో ప్రచార పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న షార్ డైరెక్టర్ తదితరులు

సూళ్లూరుపేట, జూలై 24: ఈ ఏడాది ఆగస్టు 23న నిర్వహించే నేషనల్ స్పేస్ డే పురస్కరించుకొని బుధవారం షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ గుంటూరులోని ఆర్‌వీఆర్ జూనియర్ కళాశాలలో ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. చంద్రయాన్-3లో భాగంగా ప్రజ్ఞాన్ రోవర్ గత ఏడాది ఆగస్టు 23న చంద్రుడిపై విజయవంతంగా అడుగు పెట్టింది. దీన్ని పురస్కరించుకొని ప్రధాని నరేంద్రమోదీ ఆ రోజును నేషనల్ స్పేస్ డేగా ప్రకటించారు. ఈక్రమంలో ఈ ఏడాది నేషనల్ స్పేస్ డే సంబరాలను నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించేందుకు ఇస్రో శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈ నెల 22న భువనేశ్వర్‌లో ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ ఆధ్వర్యంలో సంబరాలు ప్రారంభమయ్యాయి. బుధవారం రెండో రోజు సంబరాలకు గుంటూరులోని ఆర్‌వీఆర్ జూనియర్ కళాశాల వేదికైంది. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోస్టర్లను ఆవిష్కరించారు. నెల రోజుల పాటు దేశంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించే సంబరాల్లో ఇస్రో చేపట్టే రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహాలు, శాస్త్రసాంకేతిక రంగాలపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో షార్‌లోని సీనియర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దశాబ్ధాలుగా సాగు చేస్తున్నాం... న్యాయం చేయండి

● ఆర్డీవోకు కొత్తపట్నం రైతుల వినతి



గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్‌కుమార్

కోట, జూలై 24: కొన్ని దశాబ్ధాలుగా ప్రభుత్వ భూముల్లోనే ఉంటున్నాం... ఆర్థిక స్థోమత లేనికారణంగా ఆ భూములు ఆధీనంలో ఉన్నప్పటికీ సాగు చేయలేదు. తక్షణం స్పందించి భూములను నమ్ముకొని ఉన్న సన్నకారు రైతులైన తమను గుర్తించాలని కొత్తపట్నం రైతులు కోరారు. కోట మండలం కొత్తపట్నంలో బుధవారం చెన్నై, బెంగళూరు కోస్టల్ కారిడార్‌లో భూములు కోల్పోయే రైతులకు పరిహారం పంపిణీ చేసేందుకు గ్రామసభ నిర్వహించారు. గూడూరు ఆర్డీవో ఎం.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ అధికారులు ఈ గ్రామసభను నిర్వహించారు. చెన్నై - బెంగళూరు కోస్టల్ కారిడార్‌లో కొత్తపట్నం రెవెన్యూలోని 444 ఎకరాలు వెళ్లనున్నాయన్నారు. ఆయా భూములన్నీ దాదాపుగా ప్రభుత్వ భూములే. పంచాయతీ పరిధిలోని పలు మజరా గ్రామానికి చెందిన సన్నకారు రైతులు ఆయా భూముల్లో జీడిమామిడి, వేరుశనగపంటలు పండిస్తున్నామని గ్రామసభలో అధికారుల ముందు రైతులు తెలిపారు. కొన్ని భూముల్లో తాము ఉన్నప్పటికి ఆర్థిక స్థోమతలేని కారణంగా సాగు చేయలేదన్నారు. ఆయా భూములకు సంబంధించిన పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు. గురువారం నుంచి కొత్తపట్నం పంచాయతీలో అధికారులతో కూడిన మూడు బృందాలు పర్యటిస్తాయని ఆర్డీవో తెలిపారు. ఆయా బృందాలు కోస్టల్ కారిడార్‌కు వెళ్లే భూముల్లో రైతుల వివరాలు సహా పంటలు సాగు అంశాలపై భూములపై సర్వే చేస్తారన్నారు. అర్హులైన ప్రతి రైతుకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు. రైతుల వినతులు, సమస్యలను గ్రామసభలో చర్చించి నివేదిక తయారుచేశారు. ఈ గ్రామసభలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ చంద్రశేఖర్, ఇన్‌చార్జి తహసీల్దారు ఏ.మల్లికార్జున్‌రావు, వీఆర్వో వి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రధాన కూడళ్లు

● ఆందోళన చెందుతున్న వాహన చోదకులు



వరగలి క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ప్రమాదకర కూడలి

చిల్లకూరు, జూలై 24: వాహన చోదకులు జాతీయరహదారిపై ఉన్న కూడళ్ల వద్ద వాహనాలను నడపాలంటే భయాందోళన చెందుతున్నారు. మండలంలోని వరగలి క్రాస్ రోడ్డు, కోట క్రాస్ రోడ్డు వద్ద కూడళ్ల ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ కూడళ్ల వద్ద ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు బెంబేలెత్తుతున్నారు. ప్రధానంగా వరగలి క్రాస్ రోడ్డు సమీపంలో తహసీల్దారు కార్యాలయం ఉంది. దీంతో మండల ప్రజలతోపాటు పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు సమస్యల పరిష్కారం కోసం వస్తుంటారు. తహసీల్దారు కార్యాలయానికి వెళ్లాలంటే రోడ్డు దాటాల్సి ఉంది. అంతేకాకుండా ప్రస్తుతం కూడళ్ల వద్ద రోడ్డు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వరగలి క్రాస్ రోడ్డు వద్ద పలు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, హోటళ్లతోపాటు పలు దుకాణాలు ఉండడంతో లారీలను రోడ్డుపక్కనే నిలుపుతుంటారు. దీంతో కూడలి వద్ద వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. వాహనదారులు, పాదాచారులు వరగలి క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలకు గురుతామేమోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా కోట క్రాస్‌రోడ్డు వద్ద పలు గ్రామాలకు వెళ్లాలన్నా, సమీప ప్రాంతాలలోని పరిశ్రమలకు వెళ్లాన్నా రోడ్డు దాటాల్సి వస్తుంది. దీంతో ఆ సమయంలో కూడా ప్రమాదాలకు గురవుతామేమోనని పలువురు వాహనదారులు అంటున్నారు. గతంలో ఆయా కూడళ్ల వద్ద జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆయా కూడళ్ల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఏలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో ఆయా కూడళ్ల వద్ద వాహనదారులు చిన్నచిన్న ప్రమాదాలకు గురైన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇకనైనా అధికారులు కూడళ్ల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు, మండల ప్రజలు కోరుతున్నారు.

చిట్టేడులో క్రీడా దినోత్సవం



విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కోట, జూలై 24: మండలంలోని చిట్టేడులో ఉన్న నల్లపరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఉన్నత పాఠశాలలో బుధవారం క్రీడా దినోత్సవం సందర్భంగా ఆటలపోటీలు జరిగాయి. ఇన్‌చార్జి హెచ్‌ఎం జయంతి ఆధ్వర్యంలో శిక్షా సప్తాహ్‌లో భాగంగా విద్యార్థిని, విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, చదరంగం, క్యారమ్స్, తొక్కుడుబిళ్ల, దూకుళ్లు, గోలీలాట, బొంగరాల ఆట తదితర పోటీలు నిర్వహించారు. ఆ క్రీడల్లో విజేతలకు షీల్డ్‌లు అందించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం పొందవచ్చని ఉపాధ్యాయులు తెలిపారు. పీఈటీ కృష్ణ ఉపాధ్యాయులతో కలసి క్రీడలను పర్యవేక్షించారు.


ఉచ్చూరులో పశు వైద్యశిబిరం

దొరవారిసత్రం, జూలై 24: మండలంలోని ఉచ్చూరులో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. రాష్ట్రీయ గోకుల మిషన్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో జిల్లా పశువైద్యశాఖ అధికారి ఎ.రవికుమార్ ఆధ్వర్యంలో గర్భ కోశ వ్యాధి నివారణ చికిత్సలు చేశారు. రైతులకు మందులను, మినరల్స్ మిక్చర్ ప్యాకెట్లను పంపిణీ చేవారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ... రైతులు మేలైన జాతి పాడి పశువులను ఎంపిక చేసుకొనే సమయంలో పశు వైద్యుల సహాయం తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 6000 మేలైన పాడి పశువులకు కృత్రిమ గర్భదారణ చేయాలని లక్ష్యంగా పెట్టుకొన్నట్లు తెలిపారు. రూ.500 చెల్లిస్తే వైద్యులు వచ్చి పరీక్షలు చేస్తారని తెలిపారు. కృత్రిమ గర్భ ధారణ ద్వార పేయి దూడలు జన్మించేలా చేస్తారని తెలిపారు. నెల్లూరు జిల్లా పశుగణావృద్ధి సంఘం(డీఎల్‌డీఏ) ఈవో సోమయ్య, నాయుడుపేట, పెళ్లకూరు పశు వైద్య శాఖ ఏడీలు గోవర్ధన రెడ్డి, ధనంజయ్య, దొరవారిసత్రం పశువైద్యధికారి డాక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పెంచండి

కోట, జూలై 24: మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా విద్యార్థులకు వండి పెడుతున్న భోజనం, కూరల్లో నాణ్యత పెంచాలని ఎంఈవో డి.మస్తానయ్య కోరారు. కోట పట్టణంలోని గమళ్లపాళెం ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఈవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. హెచ్‌ఎంకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు.

ముక్కంటి సేవలో అమెరికన్లు



రాహుకేతు పూజలు చేసుకుంటున్న అమెరికా దేశస్థులు

శ్రీకాళహస్తి, జూలై 24: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని బుధవారం అమెరికా దేశస్థులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు. ముందుగా రాహుకేతు పూజలను చేయించుకుని, అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో అమెరికన్లను వేదపండితులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శ్రీకాళహస్తీశ్వరాలయంలో శిల్పకళ అద్భుతంగా ఉందని, స్వామిఅమ్మవార్లను దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు.

దాడి కేసులో నిందితుడి అరెస్టు

నాయుడుపేట టౌన్, జూలై 24: మహిళపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరచిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున నాయుడుపేట - మల్లాం జంక్షన్ వద్ద బియ్యం విక్రయించే లక్ష్మి అనే వివాహితపై శ్రీకాళహస్తికి చెందిన నాగార్జున్ అలియాస్ వెంకటరమణ కత్తితో దాడి చేసిన విషయం విదితమే. ఈ కేసులో నాగార్జున్‌ను బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

చెంగాళమ్మకు బంగారు కళ్ల వితరణ

సూళ్లూరుపేట, జూలై 24: తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దేవత చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారికి బుధవారం సూళ్లూరుపేట పట్టణానికి చెందిన ఏ.రాము, సుజాత దంపతులు 8 గ్రాముల బంగారు కళ్లు, అదే విధంగా 9 గ్రాముల వెండి కళ్లను వితరణ చేశారు. వారికి ఆలయ సిబ్బంది కామేశ్వరరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వంశీ, శేఖర్, మూర్తి తదితరులు ఉన్నారు.

ఆరు కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి, నిందితుడితో సెబ్ అధికారులు

గూడూరు, జూలై 24: అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఏఈఎస్ జె.రమేష్ తెలిపారు. బుధవారం స్థానిక సెబ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... చిల్లకూరు మండలం బూదనం టోల్‌ప్లాజా వద్ద బుధవారం వాహన తనిఖీలు చేపట్టామన్నారు. ఈ సమయంలో ఒడిశా రాష్ట్రం కోరపల్లి కి చెందిన నందసాహు అనే వ్యక్తి ఓ బ్యాగ్‌పట్టుకుని అనుమానస్పదంగా తిరుగుతున్నాడన్నారు. దీంతో అతన్ని ఆపి బ్యాగ్‌ను సోదా చేయగా రూ.30వేల విలువైన ఆరు కిలోల గంజాయి ఉండడంతో స్వాధీనం చేసుకుని నందసాహును అరెస్ట్ చేశామన్నారు. ఇతను చెన్నైలోని రెడ్‌హిల్స్‌లో ఓ హోటల్‌లో పనిచేస్తూ ఒడిశా గంజాయిని చెన్నైకు తరలించి విక్రయిస్తాడని విచారణలో తేలిందన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఈబీ సీఐ ఎం.రమేష్, ఎస్‌ఐలు మోసెస్, విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి హామీ పనులు



ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచనలిస్తున్న ఈసీ

డక్కిలి, జూలై 24: ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల్లో ఫీల్డ్ అసిసెంట్లు పాదర్శకత పాటించాలని ఉపాధిహామీ పథకం ఈసీ దామోదర్ పేర్కొన్నారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పనులపై ఫీల్డ్ అసిసెంట్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఒకరికీ పనులు కల్పించాలన్నారు. మస్టర్ల నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. పనికి హాజరుకాని వారికి మస్టర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల వివరాలను తెలుసుకున్న ఆయన పనుల నిర్వహణపై పలు సూచనలు ఇచ్చారు.

ప్రమాదాల నివారణకు బారికేడ్ల ఏర్పాటు



హోలి క్రాస్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన బ్యారికేడ్

సూళ్లూరుపేట, జూలై 24: పట్టణం మీదుగా వెళ్లే జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు సూళ్లూరుపేట పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో సీఐ మధుబాబు, ఎస్‌ఐ రహీం రెడ్డి స్థానిక హోలిక్రాస్ కూడలి వద్ద జాతీయ రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేశారు. జాతీయ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసి సర్కిల్ వద్ద కానిస్టేబుళ్లను నియమించారు. దీంతో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు..

విద్యుత్ స్తంభం మార్పిడితో తాగునీటి సరఫరాకు అంతరాయం



నాయుడుపేట టౌన్, జూలై 24: పట్టణంలోని గాంధీమందిరం పార్కు వద్ద విద్యుత్ స్తంభం మార్పిడికి తీసిన గుంతలో దిగువన వాటర్ పైపులైన్ ధ్వంసమైనట్లు మున్సిపల్ కమిషనర్ ఎం. జనార్ధన రెడ్డి బుధవారం తెలి పారు. పైపులైన్లు ధ్వంసం కావడంతో పట్టణంలోని బాలాజీ గార్డెన్స్, పొగ గొట్టం కాలనీ, పడమటి వీధి, శంకరా పురం, గెరిడీ వీధి, బ్రాహ్మణ వీధి, జైహింద్ కాలనీలకు గురువారం సాయంత్రం వరకు తాగునీటి సరఫరా ఉండదని మున్సిపల్ ఏఈ చంద్రమోహన్ తెలిపారు.

అక్రమ కట్టడాన్ని అడ్డుకున్న ఆర్‌అండ్‌బీ అధికారులు



నాయుడుపేట, జూలై 24: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డులో అక్రమ కట్టడాన్ని సంబంధిత అధికారులు బుధవారం అడ్డుకున్నారు. స్థానిక సెంట్రల్ బ్యాంక్ నుంచి గాంధీ మందిరం పార్కు వరకు 14 మీటర్ల డబుల్ లైన్ సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు జరగనున్నాయి. వీటి నడుమ విజయ గణపతి ఆలయ ప్రాంతంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ప్రైవేటు వ్యక్తి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు నిర్మాణం చేపడుతుండగా ఆర్‌అండ్‌బీ ఏఈ చంద్రానాయుడు, వర్క్‌ఇన్స్‌స్పెక్టర్ రమణ సిబ్బందితో అడ్డుకున్నారు. సొంత స్థలంలో ఏర్పాటు చేసుకోవాల్సిందిగా సూచించారు.

మహిళ మెడ నుంచి సరుడు దోపిడీ

నాయుడుపేట టౌన్, జూలై 24: పట్టణంలోని కావమ్మ గుడి వీధిలో మహిళ మెడ నుంచి 3 సవర్ల సరుడు దోపిడీ జరిగింది. కాలనీలో నివాసం ఉంటున్న వెంకమ్మ బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో తన మనవడిని ఆటో ఎక్కించి తిరిగి వస్తుండగా అకస్మాత్తుగా ఓ గుర్తుతెలియని యువకుడు వెనుకనుంచి వెంకమ్మ మెడలో ఉన్న 3 సవర్ల సరుడును లాక్కొని పరారయ్యాడు. వెంకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.